

ఈసారి రోహిణిలో రోళ్లు పగలవ్!

- అకాల వర్షాలకు తోడు ముందే పలకరించిన నైరుతి
- ఫలితంగా తగ్గుముఖం పట్టిన ఉష్ణోగ్రతలు
- జిల్లాలో విచిత్ర వాతావరణం

రోహిణి కార్తె వేళ రోళ్లు పగిలే ఎండలు కాస్తాయన్న నానుడి ఎన్నట్నుంచో ఉంది. ఈ కార్తె వస్తోందంటేనే జనం బెంబేలెత్తిపోయే పరిస్థితి ఉంటుంది. మామూలుగా ఉండే ఎండల వేడినే తట్టుకోలేమంటే, ఎండాకాలంలో చివరి కార్తె అయిన రోహిణిలో ఉండే ఎండలు మరీ అదరగొడతాయి. మే 25 నుంచి ఈ రోహిణి కార్తె ప్రవేశించింది. వాస్తవానికి రోహిణి కార్తె రోజుల్లో ఉష్ణోగ్రతలు 42-46 డిగ్రీల మధ్య నమోదవుతాయి. దీంతో వడగాల్పులు, తీవ్ర వడగాల్పులు ఉంటాయి. ఈ ఏడాది అకాల వర్షాలు, అల్పపీడనం కారణంగా వేసవికాలం.. వర్షాకాలంగా మారింది. ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటున్నాయి. ఈ వర్షాల పరంపర జూన్ వరకు కొనసాగుతుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఈసారి ఈ రోహిణి కార్తె ప్రభావం జిల్లాలో లేనట్టే.

ఈ ఏడాది ఆదివారం ప్రారంభమైన రోహిణి కార్తె జూన్ 15 వరకు ఉంటుంది. ఈ కార్తెలో అధిక ఉష్ణోగ్రతలు.. రాత్రి ఏడెనిమిది గంటల వరకు వేడి గాలులు వీస్తాయి. ఇక, మే నెలలో పగటి వేళల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43 నుంచీ 44 డిగ్రీల దాకా చేరడం సాధారణం. అయితే ఈనెల ద్వితీయార్ధం నుంచీ పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు కూడా దాటడం లేదు. జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల అకాల వర్షాలు సంభవిస్తున్నాయి. మోస్తరు వాన నుంచీ భారీ వర్షాల దాకా కురుస్తున్నాయి. దీంతో ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుముఖం పడుతున్నాయి. ఎండ తగ్గినా కొంత మేరకు ఉక్కపోత నెలకొంటున్నా మొత్తం మీద చూస్తే ఉష్ణోగ్రతలు తగ్గాయి. సోమవారం అత్యల్ప ఉష్ణోగ్రత 27.2 డిగ్రీలు, అత్యధిక ఉష్ణోగ్రత 37.1 డిగ్రీలు నమోదు కాగా గతేడాది మే నెలలో ఇదే రోజున అత్యల్పంగా 30.1 డిగ్రీలు, అత్యధికంగా 38.6 డిగ్రీలు చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గతేడాదితో పోలిస్తే ఉష్ణోగ్రతలు తగ్గడం గమనార్హం.

సాధారణాన్ని మించిన వర్షపాతం

సాధారణ వర్షపాతం 47.5 మిల్లీమీటర్లు కాగా.. ఈనెలలో సోమవారం నాటికి 73.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అంటే.. సాధారణానికి మించి వర్షపాతం నమోదైంది. దీనికితోడు నైరుతి రుతుపవనాలు వారం రోజులు ముందుగానే ప్రభావం చూపుతున్న సంగతి తెలిసిందే. నైరుతి రుతుపవనాల ముందస్తు రాక కూడా జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గడానికి కారణమవుతోంది. ఇవన్నీ కలిపి ఈ వేసవిలో జిల్లాపై రోహిణి కార్తె ప్రభావాన్ని తగ్గించాయి. రుతుపవనాల ముందస్తు రాకతో జూన్ నుంచీ మొదలు కానున్న ఖరీఫ్ సీజను పంటల సాగుకు సానుకూలం అవుతుందన్న ఆశాభావం రైతుల్లో వ్యక్తమవుతోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అన్ని సంక్షేమ పథకాలకు కేంద్ర బిందువు బియ్యం కార్డు. అర్హులై కార్డుల్లేనివారు, మార్పులు చేర్పులు చేసుకోవడానికి పదేళ్లుగా ఎదురు చూస్తున్న వారికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో 21 రోజుల వ్యవధి లోనే లబ్ధిదారులు, కార్డుదారుల నుంచి దాదాపు 29,657 దరఖాస్తులు అందాయి.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

21 రోజులు.. 29,657 వినతులు

- కొత్త రేషన్ కార్డులు.. మార్పులు, చేర్పులకు దరఖాస్తుల వెల్లువ

కూటమి అధికారంలోకి వచ్చాక పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి వరకు రేషన్ కార్డుల్లేని వారికి కొత్తవి అందించేందుకు శ్రీకారం చుట్టింది. గత పదేళ్లుగా కొత్త కార్డులు మంజూరు లేకపోవడంతో ఇప్పటి వరకు నిరీక్షిస్తున్న వారికి శుభవార్త చెబుతూ ఈ నెల 7న ఉత్తర్వులు జారీ చేసింది. ఆ రోజుటి నుంచి కొత్త కార్డుల కోసం.. ఉన్న వాటిలో మార్పులు చేర్పులు చేసుకోవడానికి దరఖాస్తులతో మీ-సేవ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాలకు లబ్ధిదారులు పరుగులు పెడుతున్నారు. దరఖాస్తు ప్రక్రియలో 10 రోజులుగా సర్వర్లు మొరాయించాయి. ప్రస్తుతం సర్వర్ల పని తీరు కొంత మెరుగు పడడంతో దరఖాస్తుదారులు సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసి వస్తున్నారు. ప్రధానంగా గతంలో చేసిన హౌస్ హోల్డ్ ఆధారంగా దరఖాస్తులను సంబంధిత సచివాలయాల్లో స్వీకరిస్తున్నారు. గత 21 రోజుల వ్యవధిలోనే జిల్లా వ్యాప్తంగా దాదాపు 29,657 దరఖాస్తులు అందాయి.

దరఖాస్తు ప్రక్రియ ఇలా..

మొదట కొత్త కార్డులు, మార్పులు, చేర్పుల కోసం సచివాలయాలకు వెళ్లిన తర్వాత డిజిటల్ అసిస్టెంట్ లాగిన్‌లో నమోదు చేస్తారు. అక్కడ నుంచి వీఆర్‌వోల లాగిన్‌కు పంపుతారు. అక్కడ పూర్తి వివరాలు పరిశీలిస్తారు. ఈకేవైసీ పూర్తి చేశారా లేదా అనేది ధ్రువీకరించాక సంబంధిత తహసిల్దార్ల లాగిన్‌కు పంపుతారు. అక్కడ నిబంధనల ప్రకారం ఆమోదం తెలిపిన తర్వాత అర్జీదారులకు రేషన్ కార్డు నెంబరుతో సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుందని డీఎస్‌వో శేషాచలం రాజు చెప్పారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల్లో అత్యధికంగా కార్డుల విభజనకు సంబంధించి వచ్చాయి. ఇక, గత వైసీపీ ప్రభుత్వం బియ్యం కార్డులపై జగన్ బొమ్మను ముద్రించింది. తాజాగా ప్రభుత్వం లోగో ఉన్న స్మార్ట్ కార్డుల జారీకి చర్యలు చేపట్టారు. దీనికి సంబంధించి జూన్ నెలలో అర్హులైన ప్రతి ఒక్కరికీ స్మార్ట్ బియ్యం కార్డులు పంపిణీ చేయనున్నారు.



విభాగాల వారీగా వచ్చిన దరఖాస్తులు

కొత్త కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులు	4222
అడ్రస్ మార్పులు	1217
కార్డుల విభజన కోసం	2308
సభ్యుల చేరిక	20,870
కార్డులు సరెండర్ చేసినవి	25
సభ్యుల తొలగింపు	684
ఆధార్ సవరణ	330
మొత్తం దరఖాస్తులు	29,657

ఇది నిరంతర ప్రక్రియ

కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేయడం, కార్డుల్లో మార్పులు, చేర్పులనేవి నిరంతరం జరిగే ప్రక్రియ. ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేదు. కొత్తగా వివాహమైన జంటలు అప్పటికప్పుడు దరఖాస్తు చేసి కార్డులు పొందవచ్చు. కొత్త కార్డుల కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన పని లేదు. దరఖాస్తు చేసిన వారం, 10 రోజుల్లో కార్డులు ఇంటికి వస్తాయి.

- శేషాచలం రాజు, డీఎస్‌వో



'యోగాంధ్ర'లో భాగస్వాములు కండి

తిరుపతి, మే 27 (ఆంధ్రజ్యోతి): 'భారతీయుల సనాతన సంపదైన యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఒక భాగం చేసుకోవాలి. యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలి'అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య పిలుపునిచ్చారు. యోగాంధ్ర ప్రచారంలో భాగంగా మంగళవారం తిరుపతిలోని పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహం నుంచి నాలుగుకాళ్ల మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. నెలరోజులు పాటు యోగాపై ప్రజలకు అవగాహన, ప్రయోజనాలు వివరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని జూన్ 15న 5వేల మందితో తిరుమలలో నిర్వహించనున్నామని తెలిపారు. ప్రతి మండలానికి నలుగురు శిక్షకులను ఏర్పాటు చేసి.. 200 మందికి చొప్పున శిక్షణ, అందరికీ యోగాపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 10 లక్షల మంది యోగాలో ప్రావీణ్యం పొందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్ నరసింహాచారి, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండు హోం స్టేల లైసెన్సుల రద్దుకు అనుమతి ఇవ్వండి

- వ్యభిచారం నిర్వహిస్తుండటంతో చర్యలకు పోలీసుల ప్రతిపాదనలు

తిరుపతి (నేరవిభాగం), మే 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వ్యభిచార గృహాలుగా వాడుతున్న రెండు హోం స్టేల లైసెన్సులు రద్దు చేసి, సీజ్ చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆర్డీవోకు అలిపిరి సీఐ రాంకిషోర్ లేఖ రాశారు. ఇందులో దుర్గా హోం స్టేలో వ్యభిచారం నిర్వహిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. నిర్వాహకుడు వెంకటేష్‌తో పాటు రమణయ్యను మంగళవారం కోర్టులో హాజరుపరచగా వారికి న్యాయమూర్తి రిమాండ్‌కు విధించారు. అలాగే గతేడాది నవంబరులో ఇదే తరహాలో సెవెన్ హిల్ హోం స్టేలో వ్యభిచార కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. దీనిపై నిర్వాహకులను అరెస్టు చేశారు. ఈ రెండు హోం స్టేల లైసెన్సులను రద్దు చేయడంతో పాటు శాశ్వతంగా సీజ్ చేయడానికి ఆర్డీవో రామ్మోహన్‌రావుకు ప్రతిపాదనలు పంపారు. వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఎక్కడైనా అనైతిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ రాం కిషోర్ విజ్ఞప్తి చేశారు.



గంగమ్మకు కరెన్సీ కళ

తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మకు కరెన్సీ కళ వచ్చింది. జాతర ముగిసిన తర్వాత రెండో మంగళవారం మరు పొంగళ్ల కార్యక్రమం సందర్భంగా అమ్మవారిని, సన్నిధిలోనూ 500, 200, 100, 50, 20, 10 రూపాయల నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి



చంద్రబాబుకు కండువా కప్పుతున్న పులివర్తి నాని



సుగుణమ్మ అభివాదం



అనుచరులతో గాలి భానుప్రకాష్

మహానాడులో నేతల సందడి



శాప్ చైర్మన్ రవి ప్రసంగం



ప్రసంగిస్తున్న తిరుపతి రూరల్ పార్టీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి



సోషల్ మీడియా కార్యకర్త శశి

తిరుపతి, మే 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమంలో తొలిరోజు చిత్తూరు,తిరుపతి జిల్లాల నేతలు కీలక పాత్ర పోషించారు. మహానాడు ప్రాంగణంలోకి చేరుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు ప్రతినిధుల పేర్లు నమోదు చేసుకునే స్టాల్ వద్దకు రాగానే చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఆయన పేరు నమోదు చేయించి మహానాడు కిట్ అందజేశారు. మహానాడులో పార్టీకి తన వంతుగా రూ. 10,00,116 విరాళం అందజేశారు. శాప్ చైర్మన్ రవి నాయుడు 'కార్యకర్తల సంక్షేమం'పై తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. తిరుపతి రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి ఈ తీర్మానాన్ని బలపరుస్తూ ప్రసంగించారు.శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ సోషల్ మీడియా విభాగం యాక్టివిస్టు శశి 'మాదక ద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం' అంశంపై తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం దక్కించుకున్నారు. ఆయన ప్రసంగం ఆకట్టుకుంది. చంద్రబాబు, లోకేశ్ ఆయన్ను అభినందించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ తనయుడు వినీల్ యువనేత నారా లోకేశ్‌తో పాటు పరిటాల శ్రీరామ్, భూమా జగద్విఖ్యాత్‌రెడ్డి తదితరులతో సన్నిహితంగా మసలుతూ ఏర్పాట్లు పర్యవేక్షిస్తూ కనిపించారు. తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు తెలపగా హోం మంత్రి అనిత, నందమూరి సుహాసిని తదితరులతో సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ సన్నిహితంగా గడిపారు. జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సమన్వయ కమిటీ సభ్యులుగా బిజీబిజీగా పని చేస్తూ కనిపించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ, శాప్ చైర్మన్ రవినాయుడు, పంతగాని నరసింహ ప్రసాద్, అన్నమయ్య జిల్లా పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి, పులివర్తి వినీల్, శ్రీధర్ వర్మ, నీలాయపాలెం విజయ్‌కుమార్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం టీడీపీ ఇంచార్జి, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.వి.థామస్, పీలేరుకు చెందిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్, మదనపల్లెకు చెందిన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, తిరుపతి పార్లమెంటు ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీపతి బాబు తదితరులు మహానాడు కమిటీల్లో తమకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తిస్తూ బిజీగా కనిపించారు.



తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, చిత్తూరు, తిరుపతి టీడీపీ అధ్యక్షులు సీఆర్ రాజన్, నరసింహ యాదవ్



బొజ్జల సుధీర్‌రెడ్డి



లోకేశ్‌తో సత్యవేడు పరిశీలకుడు చంద్రశేఖర్ - పులివర్తి వినీల్

పట్టు చీరల అలంకరణలో మిట్టమీద గంగమ్మ



పట్టు చీర అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు

చంద్రగిరి, మే 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి గంగమ్మ జాతర పురస్కరించుకుని చంద్రగిరిలోని మిట్టమీద గంగమ్మ మంగళవారం పట్టు చీరల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. వివిధ రకాల పట్టు చీరలు కట్టి అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ శానిటరీ ప్యాడ్స్ పంపిణీ



శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ అడ్మినిస్ట్రేటర్ గౌరీ

పాకాల, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామలచెరువు పంచాయతీ మంగినాయనిపల్లెలో లయన్స్ క్లబ్, సత్యం చారిటబుల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు ఉచితంగా పర్యావరణ పరిరక్షణ శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అడ్మినిస్ట్రేటర్ ఎం.గౌరి మాట్లాడుతూ మహిళలు, బాలికలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సంప్రదాయంగా ఉపయోగించే ప్లాస్టిక్, జెల్, కెమికల్స్‌తో తయారయ్యే శానిటరీ ప్యాడ్స్ ఉపయోగించరాదన్నారు. పర్యావరణానికి హాని కలగని శానిటరీ ప్యాడ్స్ వాడకంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే కాకుండా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్య క్రమంలో సత్యం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మానస, లయన్స్‌క్లబ్ జోన్ చైర్ పర్సన్ మారసాని విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు యోగా శిక్షణ



పాకాలలో సచివాలయ ఉద్యోగులకు యోగా శిక్షణ ఇస్తున్న మాస్టర్ ప్రకాష్

పాకాల, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం సచివాలయ ఉద్యోగులకు యోగా శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి, యోగా మాస్టర్ ఎం.ప్రకాష్ శిక్షణ ఇచ్చారు. 31వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. యోగాతో శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. సచివాలయ, వెలుగు, మండల సిబ్బంది ఈ ఉచిత యోగా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అరుణ కోరారు.

యోగా మన జీవితంలో భాగం కావాలి



భాకరాపేటలో యోగాభ్యాసం చేస్తున్న ప్రజలు

భాకరాపేట, మే 27(ఆంధ్రజ్యోతి): యోగా మన జీవితంలో భాగం కావాలని ఎంపీడీవో గిడ్డయ్య తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా చిన్నగొట్టిగల్లు, భాకరాపేట ఉన్నత పాఠశాలల క్రీడా మైదానాల్లో మంగళవారం ప్రజలకు యోగాపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దేశరక్షణకు ఉత్తమ పౌరులను అందించడానికే ఎన్‌సీసీ

● కెప్టెన్ రాజగోపాల్ జగదీష్ ఆత్రే



విమానాల నమూనాలతో అందిస్తున్న శిక్షణ

రామచంద్రాపురం, మే 27(ఆంధ్రజ్యోతి): దేశరక్షణకు ఉత్తమ పౌరులను అదించడానికే ఎన్‌సీసీ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని క్యాంపు కమాండెంట్ కెప్టెన్ రాజగోపాల్ జగదీష్ ఆత్రే అన్నారు. మంగళవారం సి.రామాపురంలోని వెరిటాస్ సైనిక పాఠశాల ఆవరణంలో 11 ఎయిర్ స్క్వాడ్రన్(టెక్నికల్) ఎన్‌సీసీ తిరుపతి గ్రూప్ ప్రధాన కార్యాలయాల ఆధ్వర్యంలో కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవడానికి ఎన్‌సీసీ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈ శిబిరాల్లో క్యాడెట్లకు యోగా శిక్షణ, విపత్తులు, ప్రమాదాల నివారణపై డ్రిల్స్ పారిశుధ్యం, ఆరోగ్యంపై వర్క్‌షాపులు, ఆయుధాల నిర్వహణ, ఎయిర్ వింగ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు కేర్ టేకింగ్ ఆఫీసర్ రాజశేఖర్, క్యాంపు పర్యవేక్షకులు గుణశేఖర్ తెలిపారు. ఎయిర్‌ఫోర్సు శిక్షణా అధికారి లక్ష్మీనరసింహ విద్యార్థులకు విమానాలు నడపడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ క్యాంపు కమాండెంట్ కల్నల్ శ్రీనివాసులు, పర్యవేక్షకుల గుణశేఖర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ డిగ్రీ, పీజీ పరీక్షా ఫీజు నోటిఫికేషన్ విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ, పీజీ, డిప్లొమా పరీక్షల నోటిఫికేషన్ విడుదలైంది. ఫీజు చెల్లించేందుకు ఈ నెల 31వ తేదీ దాకా గడువు విధించారు. రూ.500 అపరాధ రుసుంతో జూన్ 20 వరకు అవకాశం కల్పించినట్లు ఆ వర్సిటీ తిరుపతి రీజియన్ కో-ఆర్డినేటర్ మల్లికార్జునరావు తెలిపారు. ఇతర వివరాలకు 73829 29617 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

కిటకిటలాడిన ముక్కంటి క్షేత్రం



శ్రీకాళహస్తి, మే 27 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. సుమారు 30వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారు లు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 594 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,537మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,141మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,952మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,960, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 566మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 420 మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 133మంది భక్తులు పూజలుచేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు 27,904 విక్రయించారు.

చంద్రగిరి

తిరుచ్చిపై శ్రీకృష్ణుడి అభయం



ఉభయదేవేరులతో తిరుచ్చిపై ఊరేగుతున్న శ్రీకృష్ణస్వామి

తిరుచానూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని అమ్మవారి ఆలయం ప్రాంగణంలో కొలువై ఉన్న రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామికి మంగళవారం సాయంత్రం అత్యంత వేడుకగా తిరుచ్చి ఉత్సవం జరిగింది. స్వామివారి జన్మనక్షత్రం రోహిణిని పురస్కరించుకుని ఆలయంలో విశేషాది పూజలను అర్చకులు నిర్వహించారు. అభిషేకం జరిపించారు. సాయంత్రం ఉభయ దేవేరులతో కలిసి స్వామివారు బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

తిరుచానూరులో వెలసిన పద్మావతి అమ్మవారిని మంగళవారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. ఉదయం మాజీ డీజీపీ ద్వారకా తిరుమలరావు, మధ్యాహ్నం ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

సంపద తయారీ కేంద్రాన్ని దూరంగా ఏర్పాటు చేయాలి



డీటీకి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

భాకరాపేట, మే 27(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని చికరాల చెరువు గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మంగళవారం డీటీ వాసుదేవ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి దగ్గరగా చెత్త సంపద కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడతామని తెలియజేశారు.

మహిళలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చంద్రగిరి, మే 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని న్యాయశాస్త్ర విద్యార్థులు అన్నారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి చెందిన న్యాయశాస్త్ర విభాగంలోని ఆర్‌యూఎస్‌ఏ ప్రాజెక్టు ఇన్వేస్టిగేటర్, ప్రిన్సిపాల్ క్రిష్ణకుమారి, ప్రొఫెసర్ సీతాకుమారి నేతృత్వంలో మంగళవారం చంద్రగిరిలోని వెలుగు కార్యాలయంలో మహిళలకు సైబర్ నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ప్రస్తుతం ఆన్‌లైన్ నేరాలు ఎక్కువయ్యాయని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి మహిళ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళలకు రక్షణ కల్పించే చట్టాలను వివరించారు. ఏపీఎం గంగయ్య, లా విభాగం విద్యార్థులు శ్రావణి, జయశ్రీ, రోహిత్, సీవీఎస్ శర్మ, లక్ష్మి పాల్గొన్నారు.

బంగారు గొలుసు దోపిడీ

శ్రీకాళహస్తి, మే 27(ఆంధ్రజ్యోతి): నడచి వెళుతున్న మహిళ మెడలోని బంగారు గొలుసును ద్విచక్ర వాహనంపై వచ్చిన దుండగులు దోపిడీ చేశారు. శ్రీకాళహస్తి పట్టణ శివారు బంగారమ్మ కాలనీకి చెందిన సురేఖ(42) తెలుగుగంగ కాలనీ రోడ్డులో వాకింగ్‌కు వెళ్తుంది. మంగళవారం ఉదయం వాకింగ్ చేస్తుం డగా కాలనీలో మాటువేసిన ముగ్గురు దుండగులు మహిళ మెడలోని 32గ్రాముల బంగారు గొలుసును లాక్కుని ఎన్టీఆర్‌నగర్ కాలనీ వైపు పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యూపీ కార్మికుడి మృతి

ఏర్పేడు, మే 27(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని కార్మికుడు మృతి చెందాడు. ఏర్పేడు ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాలు... ఉత్తరప్రదేశ్‌కు చెందిన రిషికేష్(33) మేర్లపాక సమీపంలో ఉన్న పుష్పిత్ స్టీల్స్‌లో పనిచేస్తున్నాడు. కర్మాగారం ఆవరణలోని క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం తెల్లవారు జామున పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనింది. ఈ ప్రమాదంలో రిషికేష్ దుర్మరణం చెందాడు. సమాచారం తెలుసుకున్న సహచర కార్మికులు యజమాన్యానికి విషయాన్ని చేరవేశారు. ఈక్రమంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మహానాడుకు తరలిన ఆర్‌సీపురం నాయకులు





చిన్నబాబుకు జ్ఞాపిక అందజేస్తున్నఎన్టీఆర్ ట్రస్టు సీఈవో - ఎమ్మెల్యే నానిని కలిసిన ఆర్‌సీపురం నాయకులు

రామచంద్రాపురం, మే 27(ఆంధ్రజ్యోతి): కడపలో నిర్వహిస్తున్న టీడీపీ మహానాడుకు ఆర్‌సీపురం మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన తనయుడు వినీల్ మహానాడులో కీలకబాధ్యతలు నిర్వహిస్తుండటంతో ఆయనకు ఆర్‌సీపురం నాయకులు, కార్యకర్తలు సహాయ సహకారాలు అందిస్తున్నారు. మహానాడులో భాగంగా ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు నిర్వహిస్తున్న బ్లడ్ డొనేషన్ క్యాంపులో తిరుపతి రుయా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ చిన్నబాబు సహాయ సహకారాలు అందిస్తుండటంతో సీఈవో రాజేంద్ర మెమెంటోతో ఆయన్ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దేవానందంనాయుడు, మాజీ ఎంపీపీ కేశవులునాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, నాయకులు జనార్దన్‌చౌదరి నరసింహచౌదరి, హరిప్రసాద్, ఉమాపతి నాయుడు, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

జనని మిత్ర యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోండి



పజలతో మాట్లాడుతున్న స్టేట్ అడిషనల్ డైరెక్టర్ అనిల్‌కుమార్

తిరుపతి(కలెక్టరేట్), మే 27(ఆంధ్రజ్యోతి): గర్భిణులు జనని మిత్ర యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని స్టేట్ అడిషల్ డైరెక్టర్(ఎంసీహెచ్) డాక్టర్ అనిల్‌కుమార్ తెలియజేశారు. తిరుపతి రూరల్ మండలం దామినేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని పాడిపేట విలేజ్ హెల్త్ క్లినిక్‌ను డీసీహెచ్ఎస్ బాలకృష్ణ నాయక్‌తో కలిసి మంగళవారం ఆయన తనిఖీ చేశారు. క్లినిక్‌లో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం జనని మిత్ర యాప్ గురించి గర్భిణులకు వివరించారు. యాప్ ద్వారా మహిళల ఆరోగ్య పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. గర్భిణుల ఆరోగ్యం, ఆహారపు పోషక విలువలు, వైద్య పరీక్షలు, మందుల నియమాలు, ఇతర సమస్యలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలను సూచిస్తుందని తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్కరూ తమ ఫోన్లలో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని వివరాలను పొందుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ శ్రీనివాసరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వోడాక్టర్ మురళీకృష్ణ, డీఐవో ఇన్‌చార్జి డాక్టర్ చత్రప్రకాష్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఉదయశ్రీ, ఎస్‌వో నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తూనికల్లో తేడా వస్తే డీలర్లను తొలగిస్తాం: డీఎస్వో



తహసీల్దార్ కార్యాలయం వద్ద డీలర్ల వేయింగ్ మిషన్లను తనిఖీ చేస్తున్న తూనికలు, కొలతల అధికారులు

చంద్రగిరి, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థలో తూనికల్లో తేడాలు వస్తే డీలర్లను తొలగిస్తామని డీఎస్వో శేషాచలరాజు హెచ్చరించారు. మంగళవారం చంద్రగిరి మండలంలోని పౌర సరఫరాల గోదామును తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్ల వద్దవున్న ఈపాస్ మిషన్లు, వేయింగ్ మిషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై డీలర్లే రేషన్ సరుకులు పంపిణీ చేస్తారన్నారు. తర్వాత మండలంలోని రేషన్ షాపులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌డీటీ గంగయ్య, లీగల్ మెట్రాలజీ సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ మస్తానయ్య, టెక్నీషియన్ కిరోష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

లైసెన్సుల్లేని వాహనాల సీజ్



మైనర్‌ను ప్రశ్నిస్తున్న సీఐ

తిరుపతి(నేరవిభాగం), మే 27(ఆంధ్రజ్యోతి): అడ్డదారుల్లో వెళుతున్న వాహనాలు తనిఖీ చేయడంతో పాటు లైసెన్సులు, వాహనాలకు రికార్డులు లేని వాటిని తిరుపతి వర్సిటీ పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. ఎస్వీయూ పోలీసు స్టేషన్ పరిధిలోని తుమ్మలగుంట వద్ద సీఐ రామయ్య, ఎస్ఐలు, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఐదింటిని సీజ్ చేశారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబులను స్టేషన్‌కు తరలించారు.

గంగమ్మకు మరుపొంగళ్లు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 27 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ మరు పొంగళ్లు ఘనంగా జరిగింది. జాతర ముగిసిన తర్వాత రెండవ మంగళవారం మరు పొంగళ్లు నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక వేషధారణలతో భక్తులు సందడి చేశారు. పలువురు భక్తులు మొక్కులు సమర్పించారు. కాగా రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో పలువురు భక్తులు పౌరాణిక వేషధారణలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో జయకుమార్ పాల్గొన్నారు.

ఫైనల్‌కు పాయ్ వైస్రాయ్

● నేడు ఆదిత్య, హైపీరియన్ జట్ల మధ్య సెమీస్ పోరు

● నేటి ఉదయం ఉమెన్స్ ఎక్స్‌ొజర్ మ్యాచ్





సూర్యకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న శివశంకర్, మదనమోహన్, శ్రీధర్, రాజేష్,
సల్మాన్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందజేస్తున్న శ్రీనివాసులు మూర్తి, మురళి, సతీష్ యాదవ్, సునీల్ కుమార్

తిరుపతి(క్రీడలు), మే 27(ఆంధ్రజ్యోతి): ఐదు రోజులుగా ఎస్వీయూ తారకరామ స్టేడియంలో హోరాహోరీగా జరుగుతున్న సీపీఎల్-1 క్రికెట్ మ్యాచ్‌లో పాయ్ వైస్రాయ్ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. మంగళవారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో పాయ్ వైస్రాయ్ జట్టు హైపీరియడ్ జట్టుపై 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన హైపీరియన్ జట్టు 15.3 ఓవర్లలో 101 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. భవానీ ప్రసాద్ 27(25), హర్షారెడ్డి 26(22) పరుగులు చేశారు. పాయ్ వైస్రాయ్ జట్టు కెప్టెన్ సూర్య 4 వికెట్లు, చరణ్‌తేజ్ 3, జావిద్ 2 వికెట్లు తీసి హైపీరియన్‌ను 101 పరుగులకే కట్టడి చేశారు. అనంతరం 102 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాయ్ వైస్రాయ్ జట్టు 15 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 105 పరుగులు చేసింది. కెప్టెన్ సూర్య 22(10), లోహిత్ 21(22), చరణ్‌తేజ్ 19(28) పరుగులతో జట్టును విజయతీరాలకు చేర్చారు. బౌలింగ్‌లో 4 వికెట్లు తీసి, బ్యాటింగ్‌లో 22 పరుగులు చేసిన సూర్య మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డును కైవసం చేసుకున్నారు. ఎస్ఎల్‌వీ బిల్డర్స్ శివశంకర్, పాయ్ వైస్రాయ్ మేనేజర్ మదనమోహన్, సీడీసీఏ ఉపాధ్యక్షులు శ్రీధర్, మాజీ రంజీ ప్లేయర్ రాకేష్ చేతులమీదుగా మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకున్నారు.

స్పార్టన్ జట్టు జయకేతనం

మధ్యాహ్నం ఆదిత్య లెవెల్స్ వర్సెస్ స్పార్టన్ వారియర్స్ తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆదిత్య జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 186/7 పరుగులు చేసింది. బ్యాటింగ్‌లో అభిషేక్ 82(51), కళ్యాణ్ 41(19)తో రాణించారు. బౌలింగ్‌లో దినేష్‌వర్మ 2, మనోజ్‌సాయి 2 వికెట్లు తీశారు. 187 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన స్పార్టన్ జట్టులో ఆశిష్‌రెడ్డి 54(39), మోనీష్ 40(22), సల్మాన్ 39(23) పరుగుతో స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. దీంతో స్పార్టన్ జట్టు 19 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 188 పరుగులు చేసి విజయం సాధించింది. బ్యాటింగ్‌లో 39, బౌలింగ్‌లో 1 వికెట్ పడగొట్టిన సల్మాన్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నారు. సీడీసీఏ ఉపాధ్యక్షులు శ్రీనివాసులుమూర్తి, మురళి, జాయింట్ సెక్రటరీ సతీష్‌యాదవ్, హెడ్ కోచ్ సునీల్‌కుమార్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేశారు. కాగా నేడు ఉమెన్స్ ఎక్స్‌పోజర్ మ్యాచ్ జరుగనుంది.

విలువలు గుర్తుచేసిన 'తరమెల్లిపోతున్నదో'

● మానవ సంబంధాలను కళ్లకు కట్టిన 'తరమెల్లి పోతున్నదో' నాటక ప్రదర్శన ● ఆకట్టుకున్న 'లవకుశ' పద్య నాటకం





తరమెల్లిపోతున్నదో సాంఘిక నాటక ప్రదర్శనలోని ఓ దృశ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 27 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పంపకాల విషయంలో ఏర్పడిన విబేధాలతో ఒకే కడుపున పుట్టిన అన్నదమ్ములు జీవితాంతం కనీసం పలకరించుకోలేక పోవడం, ఇంట్లో ఫంక్షన్ జరిగితే ఊరందరినీ పిలిచి, ఒకే గర్భాన పుట్టిన రక్త సంబంధీకులను పిలవకపోవడం వంటి దృశ్యాలను 'తరమెల్లి పోతున్నదో' సాంఘిక నాటకం అత్యద్భుతంగా కళ్లకు కట్టినట్లు చూపింది. నెల నెలా నాటక ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా సుబ్బరాజు నాట్య కళా పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం మహతి కళా క్షేత్రంలో గుంటూరుకు చెందిన కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ వారిచే బొమ్మిడి రామకృష్ణ రాసిన 'తరమెల్లి పోతున్నదో' సాంఘిక నాటక ప్రదర్శన నిర్వహించారు. ఇందులో దశరథయ్య, శేషయ్య అనే ఇద్దరు ప్రాణ స్నేహితుల కేంద్రంగా ఈ నాటకం నడిచింది. శేషయ్య ఉపాధ్యాయ వృత్తిలో రిటైర్డు అవుతారు. దశరథయ్య పేదరికం కారణంగా చదువుకోలేక కూలి పని చేసుకొని జీవిస్తాడు. అయినా వీరు విలువల పాటిస్తూ జీవిస్తారు. ఈ పరిస్థితి ఈ తరంలో లేకుండా పోతోందని ఈ నాటకంలో కళాకారులు తెలియచేశారు. రాబోయే తరంలో పరిస్థితి మరింత దయనీయంగా ఉండే అవకాశం ఉందని ఆందోళనకు దృశ్య రూపం ఇచ్చారు.

భక్తిరస ప్రధానం.. లవకుశ నాటకం



సుబ్బరాజు కళా పరిషత్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన లవకుశ పౌరాణిక పద్యనాటక ప్రదర్శన భక్తిరస ప్రధానంగా సాగింది. కళాకారులు రామాయణంలోని వివిధ సన్నివేశాలను అత్యద్భుతంగా ప్రదర్శించారు. ఈ నాటకాలను ప్రదర్శించిన కళాకారులు, నిర్వాహకులను బీజేపీ నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి, గుండాల గోపీనాథరెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు, సుబ్బరాజు కళా పరిషత్ వ్యవస్థాపకులు కోనేటి సుబ్బరాజు, కళాకారులు, ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహానాడుకు తరలిన టీడీపీ శ్రేణులు



వాహనాల ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, మే27(ఆంధ్రజ్యోతి): టీడీపీ మహానాడుకు తిరుపతి నుంచి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీజీబీసీ చైర్మన్ సుగుణమ్మ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 7 గంటలకు బస్సులు, కార్లలో బయలుదేరారు. ఆమె జెండా ఊపి వాహన ర్యాలీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరుపతి నియోజకవర్గం నుంచి దాదాపు 300కు పైగా కార్లు పలువురు బస్సుల్లో మహానాడు బయలదేరారన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు బివి కీర్తి, చినబాబు, ఊట్ల సురేంద్ర నాయుడు, కరాటే చంద్ర, ఆముదాల తులసీరాం, కృష్ణయాదవ్, మునిశేఖర్ రాయల్, పాతకం వెంకటేష్, రాజయ్య తదితరులు ఉన్నారు. అదేవిధంగా పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, ముఖ్య నేతలు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, జేబీ శ్రీనివాస్, పుష్పావతి, ఊకా విజయకుమార్, మహేష్ యాదవ్ పలువురు వేర్వేరుగా బయలుదేరి వెళ్లారు.

ఎర్రమరెడ్డి పాళెం చెరువులో ఆక్రమణలు తొలగించండి



ఆక్రమణలను పరిశీలిస్తున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హేమలత

తిరుపతి(ఆటోనగర్), మే 27 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం ఎర్రమరెడ్డిపాళెం చెరువు ముంపు స్థలం ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకొని స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.హేమలత డిమాండ్ చేశారు. మంగళవారం చెరువు ఆక్రమణకు గురైన ప్రాంతాన్ని రైతులతో కలసి ఆమె సందర్శించారు. ఎర్రమరెడ్డిపాళెం గ్రామ చెరువు సర్వే నెంబరు 141లో 55 ఎకరాల చెరువు స్థలం ఉండాలన్నారు. అందులో 10 ఎకరాల 55 సెంట్లు స్థలాన్ని ముగ్గురు వ్యక్తులు ఆక్రమించి కంచె వేశారని ఆరోపించారు. చెరువు స్థలాన్ని కాపాడాలని కలెక్టర్‌కు రైతులు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు స్పందించక పోవడం అన్యాయమని ఆమె మండిపడ్డారు. అధికారులు స్పందించని పక్షంలో రైతులతో కలసి కంచెను తొలగిస్తామని ఆమె హెచ్చరించారు.

వెన్నుపోటు దినాన్ని జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి

తిరుపతి(జీవకోన), మే 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో జూన్ 4న వెన్నుపోటు దినం నిర్వహించనున్నామని ఈ కార్యక్రమాన్ని వైసీపీ శ్రేణులు విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోంద న్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎదుర్కొని పోరాటాలు సాగించాలన్నారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మేయర్ శిరీష, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్, టౌన్‌బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, మల్లం రవిచంద్రాఎడ్డి, నల్లాని బాబు, పార్టీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

పిండప్రదాన షెడ్లను ఏర్పాటు చేయండి



ఈవోకు వినతిపత్రం ఇస్తున్న నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు

తిరుపతి(జీవకోన), మే 27(ఆంధ్రజ్యోతి): కపిలతీర్థం వద్ద పితృదేవతల పిండ ప్రదానం షెడ్లను ఏర్పాటు చేయాలని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు తిరుపతి రెడ్డీస్ భారత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీటీడీ ఈవో శ్యామలరావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రామచంద్ర పుష్కరిణి, గోవిందరాజుస్వామి పుష్కరణి ప్రాంతాల్లో కనీస మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తిచేశారు. దీనిపై ఈవో శ్యామలరావు సానుకూలంగా స్పందించినట్లు నవీన్ తెలిపారు. ఈవోను కలిసిన వారిలో దుగ్గాండ్ల పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మునీశ్వర్‌రెడ్డి ఈశ్వర్‌రెడ్డి, మబ్బు శ్రీమన్నారాయణరెడ్డి, కరుణాకర్‌ఎడ్డి, సిద్ధార్థరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

తిరుపతి(ఆటోనగర్), మే 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ సర్కిల్ (జిల్లా) పరిధిలో రానున్న వర్షా కాలంలో సంభవించే విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఈ సురేంద్రనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వర్షాలు కురిసే సమయంలో విద్యుత్ స్తంభాలను తాకరాదని, స్విచ్ బోర్డులను చెమ్మ చేతులతో తాకరాదని సూచించారు రైతులు వారి విద్యుత్ మోటార్ల వద్ద అన్ని జాగ్రత్తలు పాటించాలని కోరారు. విద్యుత్ వైర్లు తెగిపోతే లైన్ మెన్‌లకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబరు 1912కు ఫిర్యాదు చేయాలని ఎస్ఈ విజ్ఞప్తి చేశారు.

విద్యార్థిని భవ్యకు అపుస్మా నేతల అభినందన



భవ్యని అభినందిస్తున్న అపుస్మానేతలు, స్కూల్ కరస్పాండెంట్ తదితరులు

తిరుపతి(విద్య), మే 27 (ఆంధ్రజ్యోతి): టెన్త్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన నెహ్రూనగర్‌లోని కుమార్‌హైస్కూల్ విద్యార్థి సి.భవ్య(596/600)ని ఏపీ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మా) నాయకులు అభినందించారు. పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అభినందనసభలో కరస్పాండెంట్ పి.వెంకటేష్‌బాబు, హెచ్‌ఎం జి.రాజ్యలక్ష్మీ, జాయింట్ డైరెక్టర్ పి.హేమచందు ప్రతిభచాటిన విద్యార్థికి రూ.10వేల నగదును అందించి సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేష్‌బాబు మాట్లాడుతూ రీవెరిఫికేషన్ అండ్ కౌంటింగ్‌లో తమ విద్యార్థికి మార్కులు పెరగడంతో రాష్ట్రస్థాయిలో మెరుగైన స్థానాన్ని సాధించిందన్నారు. అపుస్మా రాయలసీమ జోన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి, జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి శ్రీధర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి డీజీ రఘునారాయణ, నగర సంయుక్త కార్యదర్శి టి.రామకృష్ణారెడ్డి తదితరులు హాజరై విద్యార్థిని సత్కరించారు.

డాక్టరేట్ ప్రదానం



శ్యాంసుందర్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 27 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇంజినీరింగ్ సీఎస్ఈ విభాగ పరిశోధకులు సి.శ్యాంసుందర్‌రెడ్డి డాక్టరేట్ పొందారు. 'సైబర్ సెక్యూరిటీ ఛాలెంజ్ ఆన్ ద డిజిటల్ అడ్వాంటేజ్ డ్యూరింగ్ కొవిడ్-19 పాండమిక్ ఎ ప్రెడిక్టివ్ అనలిటిక్స్' అనే అంశంపై ప్రొఫెసర్ అంజన్‌బాబు, ప్రొఫెసర్ రామ్మోహన్‌రెడ్డి సంయుక్త పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. కాగా శ్యాంసుందర్‌రెడ్డి ప్రస్తుతం కడప జిల్లా మైలవరం ఎస్ఐగా పనిచేస్తున్నారు.

సోషలిజానికి పునాదులు వేసిన మహనీయుడు నెహ్రూ

తిరుపతి(వైద్యం), మే 27(ఆంధ్రజ్యోతి): దేశంలోనే సోషలిజానికి పునాదులు వేసిన గొప్ప మహనీయుడు జవహర్ లాల్ నెహ్రూ అని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ 61వ వర్ధంతి సందర్భంగా ఆయనకు చింతా మోహన్ నివాళులర్పించారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్టు

తిరుపతి(నేరవిభాగం) మే 27(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఈస్ట్ పోలీసులు మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. అతడి నుంచి దాదాపు 10 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం చెంగల్‌పట్టుకు చెందిన గణపతి కొద్ది రోజులుగా తిరుపతిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడు. ఈస్ట్ పోలీసులకు అందిన సమాచారం మేరకు తిరుచానూరు రోడ్డులోని అన్నపూర్ణమ్మ ఆలయం పక్కన వున్న పార్కింగ్ స్థలం వద్ద విక్రయానికి సిద్ధంగా ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

2 నుంచి గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఈవో తదితరులు

తిరుమల, మే27(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు జూన్ 2 నుంచి 10 వరకు జరుగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహనసేవలుంటాయి. 1న సాయంత్రం 5.30 గంటలకు అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభకానున్నాయి. 2న ఉదయం 7.02 నుంచి 7.20 గంటల నడుమ మిథున లగ్నంలో ధ్వజారోహణం జరుగనుంది. ఇక, రాత్రి 7 గంటలకు పెద్దశేషవాహనం, 3న ఉదయం చిన్నశేష, రాత్రి హంస, 4న ఉదయం సింహ, రాత్రి ముత్యపుపందిరి, 5న ఉదయం కల్పవృక్షవాహనం, రాత్రి సర్వభూపాల, 6న ఉదయం మోహినీఅవతారం, రాత్రి గరుడవాహనసేవలు జరుగనున్నాయి. అలాగే 7న ఉదయం హనుమంత, రాత్రి గజవాహనం, 8న ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ, 9న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనసేవలు జరుగనున్నాయి. చివరిరోజు 10వ తేదీన ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజారోహణం నిర్వహిస్తారు.

ఏర్పాట్లపై ఈవో సమీక్ష

బ్రహ్మోత్సవాల వివరాలు, ఫొటోలతో కూడిన పోస్టర్‌ను తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో అధికారులతో కలిసి ఈవో శ్యామలరావు ఆవిష్కరించారు. వేసవి నేపథ్యంలో బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై మంగళవారం ఆలయ ప్రాంగణంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం అధికారులతో సమీక్షించారు. వాహనసేవల సమయంలో గాంధీ రోడ్డు, కర్నాల వీధుల్లో అడ్డుగా ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాలని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రధాన రహదారుల్లో ఆర్చీలు, స్వామివారి వాహనసేవలను భక్తులు సులభంగా తిలకించేందుకు వీలుగా ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ఈ సమీక్షలో టీటీడీ ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, ఎస్ఈ వేంకటేశ్వర్లు, డిప్యూటీఈవోలు శాంతి, లోకనాథం, సెల్వం, సీఏంవో నర్మద, ఆల్ ప్రాజెక్టుల పీవో రాజగోపాల్, ఏఈవో మునికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





కూల్చేసిన ఇళ్లు- ఆందోళనకు దిగిన బాధితులు

అర్ధరాత్రి అరాచకం

- 80 పేదల ఇళ్లు నేలమట్టం
- బంగారు, నగదు లాక్కున్న దుండగులు



ఇంట్లోని వస్తువులన్నీ విరిగిపోయిన దృశ్యం

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మే 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మంగళం పరిధిలోని తిరుమల నగర్ పంచాయతీ వేణుగోపాల్ కాలనీలో సోమవారం అర్ధరాత్రి దుండగులు అరాచకానికి పాల్పడ్డారు. 80 ఇళ్లను నేలమట్టం చేశారు. బాధితుల కథనం మేరకు.. ఈ కాలనీలో సుమారు 100 చిన్న, మధ్య తరగతి కుటుంబాలు ఉంటున్నాయి. చిన్నపాటి స్థలాలను కొని.. ఇళ్లు కట్టుకుని.. 10-15 ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో దాదాపు 300 మంది.. ఏడు ఎక్స్‌కవేటర్లతో కాలనీకి వచ్చారు. మద్యం మత్తులో ఉన్న వీరు ఇళ్లలో చొరబడి బూతులు తిట్టారు. అందరినీ బయటకు పంపారు. చేతికందిన వస్తువులను, బీరువాల్లోని నగలు, నగదును దోచుకున్నారు. గంటలోపే దాదాపు 80 ఇళ్లు నేలమట్టం చేశారు. తమను ఎదిరించిన వారిని దుండగులు చితకబాదారు. పోలీసులకు ఫోన్ చేయబోతే సెల్‌ఫోన్‌లు లాక్కొన్నారు. ఆ సమయంలో ఇద్దరు కానిస్టేబుళ్లు ఘటనా స్థలానికి వస్తే వారిపైనా దౌర్జన్యం చేశారు. వారు వెళ్లి తిరుచానూరు సీఐతో ఘటనా స్థలానికి వచ్చారు. అప్పటికే దుండగులు వెళ్లిపోయారు.

వివాదం నేపథ్యమిదీ!

చెన్నాయగుంట గ్రామ లెక్కదాఖలా సర్వే నంబర్ 218/1లో 1.64 ఎకరాల్లో సుమారు వంద ప్లాట్లు ఉన్నాయి. శ్రీనివాసులురెడ్డి, రుద్రగోపి వద్ద వీరు 2011 నుంచి ఈ స్థలాలను కొన్నారు. ఈ స్థలం తమదంటే తమదంటూ రెండు వర్గాల మధ్య వివాదం నడుస్తోంది. హైకోర్టు, ఆర్డీఓ కోర్టు, జిల్లా కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయని రుద్రగోపి మీడియాకు చెప్పారు. కోర్టులో వేసిన కేసులను వెనక్కు తీసుకోవాలని నిర్మల, రాజన్‌బాబు. మునిరెడ్డి మరికొందరు మూడు నెలలుగా తనపై ఒత్తిడి చేస్తున్నారన్నారు. వారే ఈ ఇళ్లను కూల్చివేయించి ఉంటారని రుద్రగోపి చెప్పారు.

మాకు న్యాయం చేయండి

స్థల వివాదాలేవీ తమకు తెలియదని కాలనీ వాసులు చెబుతున్నారు. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రికార్డులను పరిశీలించాకే స్థలాలను కొన్నామని, కొందరు బ్యాంకు రుణాలూ తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పుడిలా అర్ధరాత్రి ఇళ్లు కూల్చి తమను నిరాశ్రయులను చేయడం ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. నగదు, నగలూ దోచుకున్నారని కన్నీటిపర్యంతమయ్యారు. తమకు న్యాయం చేయాలంటూ శిథిలాలవద్ద నిరసన తెలిపారు. కాగా, సదరు స్థల యజమానులు తమ స్థలంపై పలువురికి జీపీఏలు ఇవ్వడమే ఈ పరిస్థితికి కారణమన్న ప్రచారం ఉంది.

ఇళ్లు కూల్చినవారిపై కేసులు పెట్టండి

తిరుపతి(ఆటోనగర్)/తిరుచానూరు, ఆంధ్రజ్యోతి: వేణుగోపాల్ కాలనీలో ఇళ్లు కూల్చిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు వై.వెంకటేశ్వర రావు, జిల్లా కార్యదర్శి వి.నాగరాజు డిమాండ్ చేశారు. ఇళ్లు కూల్చిన ప్రాంతాన్ని మంగళవారం వీరు పరిశీలించారు. జరిగిన నష్టాన్ని కూల్చిన వారి నుంచి కట్టించాలని కోరారు. సీపీఎం నాయకులు కందారపు మురళి, వేణుగోపాల్, ఎస్.జయచంద్ర, సాయిలక్ష్మి, మోదీన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇళ్లు కూల్చిన వారిపై కేసులు నమోదు చేయాలంటూ సీపీఎం నాయకులు సుబ్రహ్మణ్యం, జయచంద్ర, వేణుగోపాల్, సుమన్, బుజ్జి తదితరులు తిరుచానూరు సీఐకి వినతిపత్రం ఇచ్చారు.

అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- హోం స్టేల నిర్వాహకులకు డీఎస్పీ హెచ్చరిక



హోం స్టేల నిర్వాహకులతో సమావేశమైన డీఎస్పీ భక్తవత్సలం

తిరుపతి(నేరవిభాగం), మే 27(ఆంధ్రజ్యోతి): హోం స్టేలలో అక్రమ.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం హెచ్చరించారు. 'మాకు లైసెన్సు ఉంది. పలుకుబడి ఉంది. ఏం చేసినా చెల్లుబాటు అవుతుందని జూదం, మద్యం తాగించడం కార్యకలాపాలకు పాల్పడితే పరిస్థితి సీరియస్‌గా ఉంటుంది' అని తేల్చిచెప్పారు. దుర్గా హోంస్టేలో జరిగిన వ్యభిచార ఘటనను సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ హర్షవర్ధనరాజు.. నిర్వాహకులతో తక్షణం సమావేశం నిర్వహించాలని డీఎస్పీని ఆదేశించారు. దీంతో ఆయన హోం స్టేల మేనేజర్లతో మంగళవారం రాత్రి సమావేశమయ్యారు. హోం స్టేలకు వచ్చే వారి వివరాలు, వారి ఆధార్ కార్డులు, అడ్రస్‌లు, ఫోన్ నెంబర్లు తీసుకుని రిజిస్టర్‌లో నమోదు చేయాలని స్పష్టంచేశారు. గదుల్లో ఎంత మంది ఉన్నారు? వారెవరనే వివరాలను రూము బయట ప్రదర్శించాలన్నారు. అవసరమైతే ప్రధాన వ్యక్తి ఫొటో తీసి ఉంచాలన్నారు. లాడ్జీలు, హోటళ్లు, హోం స్టేలపై అనునిత్యం తనిఖీలు ఉంటాయన్నారు. ఎక్కడైనా అసాంఘి కార్యకలాపాలు జరుగుతూ పట్టుబడితే వాటి లైసెన్సులు రద్దు చేయడంతో పాటు సీజ్ చేస్తామన్నారు. అన్ని హోం స్టేలపై ప్రత్యేక పోలీసులతో నిఘా ఉంచుతామన్నారు. ఈ సమావేశంలో ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు, హోం స్టేల మేనేజర్లు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జయంతికి ఏర్పాట్లు

తిరుపతి, మే 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జయంతిని ఇక ప్రతిఏటా మే 28న అధికారిక వేడుకగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం ఎన్టీఆర్ వేడుకలను నిర్వహించనున్నారు. అదేవిధంగా టౌన్‌క్లబ్ వద్దగల ఎన్టీఆర్ విగ్రహానికి ఉదయం 9 గంటలకు పాలాభిషేకం చేయనున్నట్లు టీడీపీ నేత శ్రీధర్ వర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా ఎన్టీఆర్ జయంతిని అధికారికంగా ప్రకటించడంపట్ల డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

వర్సిటీల్లో ...

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 27 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ, పద్మావతి మహిళా యూనివర్సిటీల్లో ఎన్టీఆర్ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు ఎస్వీయూ సెనేట్ హాల్లో సభ నిర్వహించనున్నట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతినాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయా యూనివర్సిటీ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మహానాడులో తిరుపతి నేతల సందడి



తిరుపతి, మే 27(ఆంధ్రజ్యోతి): కడపలో మంగళవారం ప్రారంభమైన మహానాడులో తిరుపతి టీడీపీ నేతలు సందడి చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ, పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్‌తో పాటు నాయకులు డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, నాయకులు శ్రీధర్ వర్మ, జేబీ శ్రీనివాస్, ఊకా విజయకుమార్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, పుష్పావతి, దంపూరి భాస్కర్, ఊట్ల సురేంద్ర నాయుడు, మహేష్ యాదవ్, సుబ్బు యాదవ్, ఆర్సీ శ్రీనివాస్, ఎస్వీఎం శ్రీధర్, జగ్గు, రఘు, రవితేజ నాయుడు, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో చెప్పుల భద్రతకూ ఆర్‌ఎఫ్ఐడీ



భక్తుడి వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది

తిరుమల, మే27 (ఆంధ్రజ్యోతి): తిరుమల కొండమీద భక్తులు వదిలేసిన చెప్పులు కుప్పలుగా పేరుకుపోతుంటాయి. వారానికి ఒక లారీ చెప్పులను వ్యర్థాల కింద తరలించాల్సి వస్తోంది. పాదరక్షల సంరక్షణ కేంద్రంలో దాచిన చెప్పులను తిరిగి వెతుక్కోవడం కూడా పెద్ద చిక్కుగా మారుతుంటుంది. దీంతో ఆధునిక సాంకేతికత సాయంతో ఆర్‌ఎఫ్ఐడి(రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్) విధానాన్ని అనుసరించాలని టీటీడీ నిర్ణయించింది. లగేజీ, సెల్‌ఫోన్లను భద్రపరిచేందుకు ప్రస్తుతం ఈ విధానాన్నే అనుసరిస్తున్నారు. కొత్త విధానం ప్రకారం చెప్పుల కేంద్రంలో భక్తుల చెప్పులు దాచే బ్యాగ్‌కు టోకెన్ల బదులుగా ఆర్‌ఎఫ్ఐడీ ట్యాగ్ ఉంటుంది. వారి మొబైల్ నెంబర్ కూడా నమోదవుతుంది. ఇందువల్ల చెప్పులు ఏ వరుసలో, ఏ ర్యాక్‌లో ఉన్నాయో దానిని స్కాన్ చేయడం ద్వారా వెంటనే తెలిసిపోతుంది. ఒకవేళ భక్తులు ఎవరైనా ఏ కేంద్రంలో చెప్పులు దాచారో మరచిపోయినా వెంటనే మొబైల్ ద్వారా సమాచారం పంపుతారు. ఇందువల్ల తిరుమలలో చెప్పుల వ్యర్థాలు తగ్గిపోతాయి. వైకుంఠం క్యూకాంప్లెక్స్2 ముందున్న చెప్పుల కౌంటర్‌లో ఈ విధానాన్ని కొద్దిరోజులుగా ప్రయోగాత్మకంగా అమలుచేస్తున్నారు. త్వరలో మరికొన్ని ప్రాంతాల్లో అమలుచేయాలని టీటీడీ భావిస్తోంది.

విష్ణునివాసంలో భక్తుల నగలు చోరీ

తిరుపతి(నేరవిభాగం) మే 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి విష్ణునివాసంలో భక్తుల బంగారు నగలు చోరీ చేశారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు....తెలంగాణ రాష్ట్రం కూకట్‌పల్లికి చెందిన శ్రీదేవి, ఆమె భర్త శ్రీధర్‌రావు ఈ నెల 15న తిరుమలకు వచ్చారు. అక్కడ నుంచి రెండు రోజుల తర్వాత తిరుపతికి వచ్చి విష్ణునివాసంలో గది తీసుకున్నారు. వారు నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు తలుపుల తాళాలు పగులకొట్టి బ్యాగులో వుంచిన దాదాపు 16 గ్రాముల బంగారు నగలు చోరీచేశారు. మంగళవారం ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కేసు నమోదు చేశారు.



తిరుమలలో బాటగంగమ్మ జాతర



బాటగంగమ్మ



విశేష అలంకరణలో అమ్మవారి ఆలయం

తిరుమల, మే27(ఆంధ్రజ్యోతి): తిరుమల బాటగంగమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. పాపవినాశనం నడక మార్గంలోని బాటగంగమ్మ ఆలయంలో ఏటా స్థానికులు జాతర నిర్వహిస్తారు. అమ్మవారి ఆలయాన్ని పుష్ప, ఫల, విద్యుత్ లైట్లతో శోభాయమానంగా అలంకరించారు. మంగళవారం ఉదయం 6 నుంచి 9 గంటల నడుమ అమ్మవారి నేత్ర దర్శనం జరిగింది. తర్వాత అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అలంకార దర్శనాలు మొదలయ్యాయి. జాతర సందర్భంగా తిరుమలతో పాటు తిరుపతి స్థానికులు బాటగంగమ్మను దర్శించుకున్నారు. అన్నదానం నిర్వహించారు.



భక్తులకు అన్నదానం

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లలో సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.5.09 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 83,542

తలనీలాలు సమర్పించినవారు: 34,265





జస్టిస్ ఇందిరేష్ - దిల్ రాజు దంపతులు

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, మే 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈఎస్ ఇందిరేష్, సినీ నిర్మాత దిల్‌రాజు, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, కర్ణాటక మంత్రి శివరాజ్ ఉన్నారు. ఆలయం ముందు నిర్మాత దిల్‌రాజు మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీ మంచి దర్శన ఏర్పాట్లు చేస్తోందని, స్వామి ప్రసాదాలు చాలా బాగుంటున్నాయన్నారు.

నలుగురు దళారులకు కౌన్సెలింగ్

శ్రీకాళహస్తి, మే 27(ఆంధ్రజ్యోతి): దర్శనాల పేరుతో భక్తులను మోసగించే నలుగురు దళారులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి తెలిపారు. ముక్కంటి ఆలయ పరిసరాల్లో భక్తులను మోసగించే దళారులపై సీఐ ప్రత్యేకంగా మంగళవారం నిఘా పెట్టారు. ఈ క్రమంలో నలుగురు యువకులు భక్తులకు మాయమాటలు చెప్పి దర్శనాలు చేయిస్తామని నమ్మిస్తుండగా సీఐ వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి పంపించారు.



పోలీసుల అదుపులో దళారీలు

భూసేకరణ, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

తిరుపతి(కలెక్టరేట్), మే 27(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టు పనులకు సంబంధించి భూసేకరణ, నిర్మాణ పనులను ప్రణాళికబద్ధంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జేసీ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వర్చువల్ విధానంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కోసం చేపడుతున్న నిర్మాణ పనులు, రైల్వే ప్రాజెక్టు పనులు, పురోగతిలో ఉన్న రేణిగుంట, పూడి, గూడూరు, రేణిగుట, పాకాల, తిరుపతి టౌన్‌కు సంబంధించి రైల్వే ప్రాజెక్టుపనులను వేగవంతం చేయాలన్నారు. నడికుడి - శ్రీకాళహస్తి ప్రాజెక్టు పనులకు సంబంధించి భూసేకరణ పూర్తయిందన్నారు. ఇక జాతీయ హైవేలు తిరుపతి-తిరుత్తణి, సి.మల్లవరం-రేణిగుంట, నాయుడుపేట-తిరుపతి, పీలేరు-కలూరు, రేణిగుంట-కడప లైన్ల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఏపీఐఐటీ జోనల్ మేనేజరు విజయ భరత్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మధుసూదన్‌రావు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ సురేంద్రనాయుడు, నేషనల్ హైవే పీడీలు రవీంద్రరావు, వెంకటేశ్వర్లు, వెంకటాచలపతి, ఆర్డీవోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మీరు ప్రతిభ సాధించి.. విద్యార్థులకు నేర్పించాలి

- ఉమ్మడి జిల్లా డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్లకు డీఈవో సూచన
- డీఆర్పీలకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో కుమార్

తిరుపతి(విద్య), మే 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడంలో ప్రతిభ సాధించి.. వారికి నేర్పించాలని డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్లకు (డీఆర్‌పీ) డీఈవో కేవీఎస్ కుమార్ సూచించారు. డీఆర్పీలకు ఆరు రోజులపాటు జరిగే ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)పై శిక్షణ తరగతులను మంగళవారం తిరుపతిలో డీఈవో ప్రారంభించి మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుంచే పిల్లలకు భాష, గణితంపై పట్టు కలిగేలా ఆటపాటలతో ఆసక్తికరంగా బోధించాలన్నారు. అటువంటి నైపుణ్యాలను డీఆర్‌పీల్లో కలిగించేందుకే ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇక్కడ బోధన నైపుణ్యాలను పెంపొందించుకుని మండల స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్‌రావు మాట్లాడుతూ.. రాయడం, చదవడం వంటి కనీస అభ్యసన స్థాయిలను విద్యార్థుల్లో పెంపొందించేందుకు డీఆర్పీల నుంచి ఉపాధ్యాయుల వరకు కృషి చేయాలన్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో తిరుపతి జిల్లా నుంచి 102 మంది, చిత్తూరు జిల్లా నుంచి 93 మంది డీఆర్పీలకు 16 మంది కేఆర్పీలు శిక్షణ ఇస్తారని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి, స్టేట్ ప్రథం కోఆర్డినేటర్ కన్నయ్యనాయుడు, చిత్తూరు జిల్లా అసిస్టెంట్ ఏఎంవో సుభాషిణి, తిరుపతి జిల్లా సమగ్రశిక్ష అల్టర్నేటివ్ స్కూల్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

డ్రోన్‌కు చిక్కారిలా..

తిరుపతి(నేరవిభాగం), మే 27(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పరిధిలో సోమవారం అర్ధరాత్రి అధునాతన మ్యాట్రిక్ ధర్మల్ 4 డ్రోన్‌తో నైట్ బీట్ నిర్వహించారు. సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. దామినేడు పరిధిలో అటుగా వెళతున్న వాహనాలను కొందరు హిజ్రాలు ఆపి ఇబ్బంది పెడుతున్న దృశ్యాలను డ్రోన్ కెమెరాలతో గుర్తించారు. అక్కడికి పోలీసులు చేరుకుని ప్రశ్నించారు. ఇక్కడకు ఊరికే వచ్చామని వారు సమాధానం చెప్పారు. రాత్రి సమయాల్లో ఎక్కడ పడితే అక్కడ ఉండకూడదని హెచ్చరించి పంపారు. వాహనదారులు, ప్రజలను ఇబ్బంది పెడితే కేసులు నమోదు చేస్తామని వారిని హెచ్చరించారు. అలిపిరి పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, జూదం ఆడుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు.



ముగ్గురు అంతరాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్టు

- 13 కిలోల గంజాయి స్వాధీనం



స్మగర్లను అరెస్టు చూపుతున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి, మే 27(ఆంధ్రజ్యోతి): ముగ్గురు అంతరాష్ట్ర గంజాయి స్మగ్లర్లను శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం అరెస్టు చూపారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి మాట్లాడుతూ.. ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి రవాణాపై నిఘా పెట్టామన్నారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి సిబ్బందితో సోమవారం సాయంత్రం పట్టణ శివార్లలోని చెన్నై రహదారిపై గంజాయి రవాణా సాగుతున్నట్లు పక్కా సమాచారంతో దాడులు నిర్వహించారన్నారు. తమిళనాడుకు చెందిన మురళి, శ్యామ్‌రాజ్, సంజయ్‌కుమార్‌తో పాటు మరో ఇద్దరు యువకులు ఒడిశా నుంచి తమిళనాడుకు గంజాయి స్మగ్లింగ్ చేస్తుంటారన్నారు. ఈ క్రమంలో గంజాయిని తమిళనాడుకు తరలిస్తుండగా మార్గమధ్యంలోని శ్రీకాళహస్తి వద్ద దాడి చేశామన్నారు. మురళి, శ్యామ్‌రాజ్, సంజయకుమార్ 13 కిలోల గంజాయితో పట్టుబడగా మరో ఇద్దరు పరారయ్యారన్నారు. ఈ కేసులో చురుగ్గా వ్యవహరించిన సీఐ నాగార్జునరెడ్డి, ఎస్ఐ పార్థసారథి, కానిస్టేబుళ్లు బాలకృష్ణ, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, నందకుమార్, రేగాన్‌ను ఎస్పీ హర్షవర్ధనరాజు అభినందించారు.

ఆర్టీసీ బస్సులను సమయపాలన ప్రకారం నడపాలి



ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో శుభ్రత పాటించి బస్సులను సమయపాలన ప్రకారం నడపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం వీసీ ద్వారా జిల్లాలోని ఆర్టీసీ డిపో మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. బస్‌స్టేషన్‌లో పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి మరుగుదొడ్ల నిర్వహణ బాగుండలన్నారు. బస్సులు అన్ని కండిషన్లలో ఉండేలా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాల్నారు. బస్‌స్టేషన్ ఆవరణలోని దుకాణాల్లో నిర్ణీత ధరలకే వస్తువులను అమ్మాలన్నారు. ఈ నిబంధనలు అతిక్రమించిన దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి వెంకట్రావు, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మహానాడు సంబరం

కడప గడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్యక్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలాది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాండ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను, ఫ్లెక్సీలను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండోరోజు మహానాడు కోసం అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.





సిలికా మైనింగ్‌కు అభ్యంతరం

పోలీసుల జోక్యంతో తరలింపు



కొండూరు వద్ద సిలికాను తరలించేందుకు వచ్చిన టిప్పర్లు

వాకాడు, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరు గ్రామ సరిహద్దుల్లో ఇళ్ల స్థలాల పక్కన ఉన్న సిలికాను తరలించేందుకు మంగళవారం సాయంత్రం అధిక సంఖ్యలో టిప్పర్లు రావడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. తహసీల్దారు రామయ్య రెవెన్యూ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. సర్వే నెంబర్లు 38, 40లో సుమారు 31 ఎకరాల్లో సిలికా తవ్వి తరలించుకునేందుకు అనుమతులు ఉన్నాయని తెలిపారు. అలాగే 2023 నుంచి 2043 వరకు సిలికాను తవ్వి తరలించేందుకు అనుమతులు ఉన్నాయని మైనింగ్ ఏడీ శ్రీనివాసులు తెలిపారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని గ్రామస్తులను చెదరగొట్టి సిలికా తరలింపునకు మార్గం సుగమం చేశారు. ఈ సందర్భంగా కొండూరు గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ సమీపంలో మైనింగ్ నిర్వహణతో పర్యావరణ ఇబ్బందులు ఉత్పన్నమవుతాయని, భూగర్భజలాలు సైతం అడుగంటి పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతులు రద్దు చేయకుంటే ఆందోళన చేపడతామని చెప్పారు.

చౌకదుకాణ డీలర్లు నిబంధనలు పాటించాలి



చౌక దుకాణదారులతో మాట్లాడుతున్న తహసీల్దారు రాజేంద్ర, సివిల్ సప్లయ్ డీటీ గోపీనాథరెడ్డి

నాయుడుపేట టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు చౌక దుకాణాల్లో నిత్యావసర సరుకులను అందజేయాలని తహసీల్దారు రాజేంద్ర తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం నాయుడుపేట పట్టణ, గ్రామీణ పరిధిలోని చౌక దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి చౌక దుకాణాల్లోనే సరుకులు అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. అలాగే 65 ఏళ్లు నిండినవారికి ఇంటి వద్దకెళ్లి రేషన్ సరుకులు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో సివిల్ సప్లయ్ డీటీ గోపీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహిత విద్యాకేంద్రం ఏర్పాటుకు పరిశీలన



హెచ్‌ఎం మాధవీలక్ష్మితో చర్చిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

గూడూరు అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సహిత విద్యా కేంద్రాన్ని ఏర్పాటు చేసే విషయాన్ని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు బోధన అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసకోవడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సహిత విద్యా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు వసతులను, సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం మాధవీలక్ష్మితో చర్చించారు. కార్యక్రమంలో హేమలత, అజయ్‌బాబు, మంగమ్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సరుకులు అందించాలి



డీలర్లతో సమావేశమైన తహసీల్దారు శ్రీనివాసులు

డక్కిలి, మే 27(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల నుంచి రేషన్ షాపుల్లోనే నిత్యావసర సరుకులను కార్డుదారులకు పారదర్శకంగా అందించాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డీలర్లలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి డీలర్లు రేషన్ షాపు వద్దే ఎలక్ట్రానిక్ కాటాతో తూకం వేసి నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని చెప్పారు. అలాగే షాపు వద్ద ధరల పట్టిక విధిగా ఏర్పాటు చేయాలన్నారు. డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నరాణి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

కోట, మే 27 (ఆంధ్రజ్యోతి): కోట పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం రాత్రి గూడూరు డీఎస్పీ గీతాకుమారి తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో రాత్రిపూట గస్తీ గురించి వాకాడు సీఐ హుసేన్‌బాషాకు సూచనలు చేశారు. అదేవిధంగా కోట పట్టణంలో ట్రాఫిక్ సమస్య నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఎస్‌ఐ పవన్‌కుమార్‌కు సలహాలు ఇచ్చారు.

విష్ణునివాసంలో భక్తుల నగలు చోరీ

తిరుపతి(నేరవిభాగం) మే 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి విష్ణునివాసంలో భక్తుల బంగారు నగలు చోరీ చేశారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు...తెలంగాణ రాష్ట్రం కూకట్‌పల్లికి చెందిన శ్రీదేవి, ఆమె భర్త శ్రీధర్ రావు ఈ నెల 15న తిరుమలకు వచ్చారు. అక్కడ నుంచి రెండు రోజుల తర్వాత తిరుపతికి వచ్చి విష్ణునివాసంలో గది తీసుకున్నారు. వారు నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు తలుపుల తాళాలు పగులకొట్టి బ్యాగులో వుంచిన దాదాపు 16 గ్రాముల బంగారు నగలు చోరీచేశారు. మంగళవారం ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కేసు నమోదు చేశారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

కోట, మే 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో విద్యానగర్, చిటేడు, కోట గ్రామాల్లో ఉన్న మద్యం దుకాణాలను అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ ఊహశ్రీ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. నిల్వలు, ఎమ్మార్పీ తదితర అంశాలకు సంబంధించిన అంశాల గురించి ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకొంటామని అన్నారు. కార్యక్రమంలో వాకాడు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించండి

పెళ్లకూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల కలిగిన పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించాలని సహిత జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దిగువచావాలి గ్రామంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల గుర్తింపు సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వం ప్రత్యేక విద్యతో పాటు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తోందని తల్లిదండ్రులు తమ పిల్లలను భవిత కేంద్రాలకు పంపాలని సూచించారు.

యోగా సాధనతో మానసిక వికాసం

వాకాడు, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో యోగాంధ్రలో కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ యోగా వల్ల ఆరోగ్యం, సిద్ధించడంతో పాటు మానసిక వికాశం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా సాధన దినచర్యగా మార్చుకోవాలన్నారు.





వినియోగదారుడు కొన్న వస్తువులను ప్లాస్టిక్ సంచిల్లో వేసి ఇస్తున్న దుకాణదారుడు - చెత్త కుండీ చుట్టూ ప్లాస్టిక్ వ్యర్థాలు

విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం

పాలిథిన్ కవర్లు, వ్యర్థాలతో పెరుగుతున్న అనర్థాలు ● పర్యావరణ పరిరక్షణకు తీవ్ర ముప్పు

సూళ్లూరుపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): పాలిథిన్ క్యారీ బ్యాగు లేనిదే ఏ వస్తువు కొనలేని, తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొంది. మనిషి జీవితంలో పాలిథిన్ కవరు నిత్యావసర వస్తువుగా మారిపోయింది. సూళ్లూరుపేట పట్టణంలో విచ్చవిలడిగా ప్లాస్టిక్ వాడకం పెరిగిపోయింది. కూరగాయలు, చేపలు మార్కెట్, సూపర్ మార్కెట్స్, హోటల్స్, వైన్స్ షాపులు, దుకాణాల వద్ద పాలిథిన్ సంచుల వినియోగం విస్తారంగా పెరిగిపోయింది. పట్టణంలో ప్రతిరోజు దాదాపు 3 టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలనే తలిస్తున్నారంటే తీవ్రతకు అద్దం పడుతోంది. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు అవగాహన కల్పిస్తున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. ప్లాస్టిక్ సంచుల్లో ఆహార వ్యర్థాలు, ఇతరత్రా పదార్థాలు నింపి బయటపడేస్తుండడంతో మూగజీవాలు తిని జీర్ణంకాక మృత్యువాత పడుతున్నాయి. పాలిథిన్ కవర్ల వల్ల కలుగుతున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం 2013 జూన్ 20న జీవో నెం.46 విడుదల చేసి.. 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న పాలిథిన్ సంచులు, రీ సైకిల్డ్ పాలిథిన్ బ్యాగ్స్, గ్లాసులు, కప్పులపై నిషేధం విధించింది. అయితే నిబంధనలు సక్రమంగా అమలు కావడం లేదు. దీంతో ప్లాస్టిక్ వ్యర్థాలు పంట కాలువలు, చెరువుల్లోకి చేరి నీరంతా కలుషితంగా మారుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువల్లో పడేయడం వల్ల మురుగునీరు ప్రవహించడం లేదు. అధికారులు స్పందించి నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకుని పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉంది.

యోగాంధ్ర శిక్షణ తరగతులు

ఓజిలి, మే 27 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో మంగళవారం యోగాంధ్ర శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈనెల 31వ తేదీ వరకు శిక్షణ తరగతులు కొనసాగించేలా అధికారులు ఈ కార్యక్రమాలను రూపొందించారు. మంగళవారం ఓజిలి, కురుగొండ, వెంకటరెడ్డిపాళెం సచివాలయాల పరిధిలోని వారికి ఓజిలి స్త్రీశక్తి భవనంలో, చిల్లమానుచేను, ఆరిమేనిపాడు, ఇనుగుంట సచివాలయాల పరిధిలోని వారికి ఆరిమేనిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, అత్తివరం, మాచవరం సచివాలయాల పరిధిలోని వారికి అత్తివరం ఉన్నత పాఠశాలలో, గ్రద్దగుంట, కరబల్లవోలు సచివాలయాల పరిధిలోని వారికి కరబల్లవోలు సచివాలయంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఓజిలిలో తహసీల్దారు పద్మావతి, కరబల్లవోలు సచివాలయంలో టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈవో-2 చంద్రశేఖర్, ఏపీఎం పద్మ, ఏపీవో చిన్నయ్య, ఆయుర్వేద వైద్యురాలు మంజుల, యోగా శిక్షకులు, టీడీపీ నాయకులు నెల్లూరు సుబ్బారావు, మస్తాన్‌రెడ్డి, కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేట మున్సిపాలిటీలోని బాపూజీ కాలనీ, గాండ్లవీధి సచివాలయాల్లో మంగళవారం యోగా శిక్షణ తరగతులు నిర్వహిం చారు. మాస్టర్ ట్రైనర్ల చేత యోగాపై అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



కరబల్లవోలు సచివాలయంలో జ్యోతిప్రజ్వలన చేసి యోగా శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న టీడీపీ కన్వీనరు విజయకుమార్ నాయుడు

యోగాపై ప్రజలకు శిక్షణ

తడ, మే 27 (ఆంధ్రజ్యోతి): యోగాపై ప్రజలకు శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో శేఖర్‌నాయక్ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మొదటగా సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశావర్కర్లకు యోగాపై శిక్షణ ఇస్తున్నామన్నారు. అనంతరం సచివాలయాల పరిధిలోని ప్రజలకు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే యోగాసనాలపై పోటీ పరీక్షలు నిర్వహిస్తామని, ఇందులో పాల్గొనేవావారు తమ పేర్లను ఆయా సచివాలయాల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గాబ్రియల్, మస్తాన్, శేషారావు, శ్రీనివాసులు, ఎస్‌డీ బాబు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రపై అవగాహన



చిట్టేడు ఉన్నత పాఠశాలలో యోగా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

కోట, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందికి యోగాంధ్రపై అవగాహన కల్పించారు. యోగా వల్ల ఉపయోగాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. అదేవిధంగా చిట్టేడు ఉన్నత పాఠశాలలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు యోగా విశిష్టత గురించి అవగాహన కల్పించారు. అలాగే చిట్టేడు, కేశవరం, గూడలి-2, ఊనుగుంటపాళెం, సిద్దవరం సచివాలయాల్లో యోగాంధ్రపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అల్లాభక్షు, జీవన్, రేవతి, ఉపాధి సిబ్బంది, ఐసీడీఎస్, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బైబిల్ శిక్షణ తరగతులు

చిల్లకూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏరూరు సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో మంగళవారం పాస్టర్ రాజేష్ ఆధ్వర్యంలో బైబిల్ శిక్షణ తరగతులను నిర్వహించారు. పాస్టర్ రాజేష్ బైబిల్ విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో లలితమ్మ, దినకర్, ప్రవీణ్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం



బోరు వద్ద తాగునీటిని పరిశీలిస్తున్న తహసీల్దారు రామయ్య

వాకాడు, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగుర్తి పంచాయతీ పరిధిలో ఉన్న ఎనిమిది గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే బోరు పాయింట్‌ను తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు మంగళవారం ప్రారంభం తాగునీటి సమస్య పరిష్కరించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ అఖిల్, ఆర్‌డబ్ల్యూఎస్ నాగజ్యోతి, సర్వేయర్ శకుంతల పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్టు

తిరుపతి (నేరవిభాగం) మే 27(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఈస్ట్ పోలీసులు మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. అతడి నుంచి దాదాపు 10 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు రాష్ట్రం చెంగల్‌పట్టుకు చెందిన గణపతి కొద్ది రోజులుగా తిరుపతిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడు. తిరుచానూరు రోడ్డులోని అన్నపూర్ణమ్మ ఆలయం పక్కన పార్కింగ్ స్థలం వద్ద విక్రయానికి సిద్ధంగా ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకుని అతడిని చేసి అరెస్టు చేశారు.

నీట మునిగిన పంట పొలాలు

పెళ్లకూరు, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారం పేట రెవెన్యూ పరిధిలో రైతులు సాగుచేసిన సుమారు 20 ఎకరాల వరి పంట నీట మునిగింది. దొరవారిసత్రం మండలం వేణుంబాక చెరువుకు తెలుగుగంగ నీరు భారీగా వచ్చి చేరుతుండడంతో రైతులు చెరువు కలుజుకు అడ్డు తొలిగించారు. దీంతో చెరువు దిగువ ప్రాంతమైన బంగారంపేట పంటపొలాలు నీట మునిగాయి. ఇటీవల నాటిన వరి పైరు పూర్తిగా దెబ్బతిని పాచిపట్టిపోయిందని రైతులు లబోదిబోమంటున్నారు.

బస్సు కిందపడి మహిళ మృతి

చిల్లకూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పున్నపువారిపాళెం సమీపంలో బస్సు కిందపడి ఓ మహిళ మృతిచెందింది. పోలీసుల వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన శివానీమహాపుడం(45) అనే మహిళ మూడేళ్లుగా పున్నపువారిపాళెం సమీపంలోని ఓ పరిశ్రమలో కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. మంగళవారం పనులకు వెళ్తుండగా పరిశ్రమలో పనిచేసే కూలీలను తీసుకువెళ్లే బస్సు వెనుక నుంచి శివానీమహాపుడంను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు దర్గాలో 'నిషాన్'

గూడూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక దర్గావీధిలోని హజరత్ సయ్యద్ హసీం హుస్సేని ఔలియా దర్గాలో బుధవారం సాయంత్రం నిషాన్ జెండా కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంగళవారం దర్గా వెల్ఫేర్ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే జూన్ 2వ తేదీ దర్గా ఆవరణలో గంధం మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.







మహానాడులో గూడూరు నియోజకవర్గ నాయకులతో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ - మంత్రి నారా లోకేశ్‌తో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ - నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మహానాడుకు బయలుదేరుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

మహానాడుకు తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు

గూడూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడులో పాల్గొనేందుకు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు తరలివెళ్లారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు ఆరికట్ల మస్తాన్ నాయుడు, సర్వోత్తమరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, నటశేఖర్, బెజవాడ రమేష్, మట్టం శ్రావణి, శ్రీదేవి తదితరులు తరలివెళ్లారు.

వెంకటగిరి: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో పులికొల్లు రాజజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, పునుగోటి విశ్వనాథనాయుడు, గంగాధరం, సీసీ నాయుడు, పప్పు చంద్రమౌళిరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, అవ్వారు సత్యనారాయణ, వెంకటముని, తోటా రామచంద్రయ్య, ఆరికట్ల శ్రీరాములు తదితరులు మహానాడులో పాల్గొనేందుకు కడప బయలుదేరి వెళ్లారు.

నాయుడుపేట: పట్టణంలోని టీడీపీ కార్యాలయం నుంచి సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మహానాడుకు బయలుదేరి వెళ్లారు.

ఓజిలి: మండలంలోని తెలుగు తమ్ముళ్లు మండల కన్వీనరు విజయకుమార్ నాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కడపలో జరిగే మహానాడుకు తరలివెళ్లారు.

పెళ్లకూరు: మహానాడుకు హాజరయ్యేందుకు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, పేరం రమేష్‌నాయుడు, దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి, కందమూడి శివకుమార్ ఆధ్వర్యంలో శిరసనంబేటి చైతన్య కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి. కలవకోలు మునీష్, మల్లిఖార్జునరెడ్డి, కేవీ నాయుడు, రాకేష్‌రెడ్డి, లోకేష్‌నాయుడు, శ్రీనివాసులు నాయుడు, పెంచలయ్య, రమణయ్య, వెంకటేశ్వర్లు తరలివెళ్లారు. అలాగే మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటి చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, నాయకులు మదన్‌మోహన్‌నాయుడు, కృష్ణమనాయుడు, సిద్దులయ్యనాయుడు, మాధవరెడ్డి, నరేంద్రయాదవ్, గురవయ్య, చంద్ర, పరుశురామ్, రవి, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

తడ: కడపలో జరుగుతున్న మహానాడులో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్, హోం మంత్రి వంగలపూడి అనిత, నందమూరి హరికృష్ణ కుమార్తె సుహాసినితో పాటు పలువురు మంత్రులను నెలవల విజయశ్రీ మర్యాదపూర్వకంగా కలిశారు.

సూళ్లూరుపేట: మహానాడుకు సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు.

చిట్టమూరు: మహానాడుకు హాజరయ్యేందుకు చిట్టమూరు, కోట, వాకాడు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు గణపర్తి కిషోర్ నాయుడు, శివకోటా రెడ్డి, నల్లపరెడ్డి వినోద్ కుమార్‌రెడ్డి, మధురెడ్డి, గోపాల్ నాయుడు, సునీల్‌రెడ్డి తదితరులు బయలుదేరి వెళ్లారు.

వాకాడు: మహానాడుకు హాజరయ్యేందుకు వాకాడు మండల టీడీపీ అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో దోశకాయల కృష్ణమూర్తి, కుంచం దయాకర్, కల్లూరు హరీష్‌నాయుడు, కోటా శ్రీనివాసులు, బత్తిన ప్రమీల, నెల్లూరు సుధాకర్‌రెడ్డి, చిరంజీవమ్మ, కలిమి వెంకటేష్, గౌస్ మోహిద్దీన్, సునీత, గంగాధరంరెడ్డి తదితరులు తరలివెళ్లారు.

కోట: మహానాడుకు హాజరయ్యేందుకు కోట నుంచి టీడీపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు మద్దాలి సర్వోత్తమరెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్ అహ్మద్, భాస్కర్‌రెడ్డి, నల్లప్పరెడ్డి వినోద్ రెడ్డి, మధుయాదవ్, దారా సురేష్, షంషుద్దీన్, తూపిలి రాధకృష్ణారెడ్డి, తీగల సురేష్‌బాబు, చాపల శ్రీనివాసులు, వాకా విజయభాస్కర్‌రెడ్డి తదితరులు ఎమ్మెల్యే పాశం సునీల్ వెంట మహానాడులో ఉన్నారు.







మహానాడుకు వెళ్లేందుకు జెండా ఊపి బయలుదేరుతున్న సూళ్లూరుపేట టీడీపీ నాయకులు - మహానాడులో చిట్టమూరు, పెళ్లకూరు నాయకులు

మోటరు స్టార్టర్ చోరీలపై నిఘా పెట్టండి: ఎస్పీ



ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌లో వాహనాల వేలానికి చర్యలు తీసుకోవాలంటూ ఆదేశిస్తున్న ఎస్పీ

ఏర్పేడు, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతుల పొలాల్లో ఉన్న మోటరు స్టార్టర్లు, కేబుల్ వైర్ల చోరీలపై దృష్టి సారించాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను కోర్టు అనుమతితో వేలం వేయాలని చెప్పారు. ఇక మోటర్ల చోరీలపై పాత రికార్డులను పరిశీలించి అలాంటి వారందరిని అదుపులోకి తీసుకుని విచారించాలన్నారు. పల్లె నిద్ర నిర్వహించాలని ఆదేశించారు. సీసీ కెమెరాలు ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. చేశారని అడిగితెలుసుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

● కాగా స్టార్టర్ల చోరీపై డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ... పాపానాయుడుపేట, ఏర్పేడు, ఎండీపుత్తూరు తదితర గ్రామాల్లో స్టార్టర్లు, కేబుళ్ల దొంగలను వీలైనంత త్వరగా పట్టుకుంటామని చెప్పారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇసుక, మద్యం అక్రమ రవాణాపై నిఘా పెంచాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. మంగళవారం రాత్రి గాజులమండ్యం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేవారు. జైలు నుంచి బయటకు వచ్చిన నిందితులపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలన్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ మంజునాథ్ రెడ్డి, ఎస్‌ఐ సుధాకర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

29నుంచి వికసిత్ కృషి సంకల్ప అభియాన్ యాత్రలు

రేణిగుంట, మే 27, (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగు చేసే పంటల్లో అధిక దిగుబడినిచ్చే రకాలు, యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్ష ప్రాముఖ్యం తదితరాలపై ఈనెల 29 నుంచి జూన్ 12 వరకు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ యాత్రలు నిర్వహిస్తున్నట్లు కేవీకే హెడ్ శ్రీనివాస్ తెలిపారు. భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఐసీఏఆర్ ఆదేశాలు మేరకు రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఐసీఏఆర్ పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యాన, పశుపోషణ, అనుబంధ శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి రోజుకు 9 గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి సుమారు 18000 మందికి పైగా రైతులకు భూసార పరీక్ష పత్ర వినియోగం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కోళ్ళ, గొర్రెలు పెంపకం, పశుపోషణ, వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

తాగునీటి కోసం రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

వరదయ్యపాళెం, మే 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 20 రోజులుగా తాగునీరు సరఫరా కాక పోవడంతో స్థానికులు రోడ్డెక్కారు. సీపీఐ నాయకులతో కలిసి రాస్తారోకో నిర్వాహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీసిటీకి గ్యాస్, నీరు సరఫరా చేసేందుకు రోడ్డుకు ఇరువైపులా పైపులైను నిర్మాణం చేపట్టారన్నారు. దీంతో స్థానికంగా సరఫరా చేసే పైపుల వ్యవస్థ ధ్వంసమై నీరు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. దీనిపై పలు మార్లు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్ మాట్లాడుతూ జనావాసాల మధ్య పనులను యుద్ధప్రతిపాదికన చేయాల్సి ఉండగా సదరు కాంట్రాక్టరు పనులు జాప్యం చేయడంతో తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న ఈవో బసిరెడ్డి పోలీసులతో సంఘటనా స్థలానికి చేరుకుని చర్చించారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. చంద్ర, శ్రీను, సైదుబాబు, సిద్ధిక్ బాషా, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వికృతమాలలో అక్రమ నిర్మాణాల తొలగింపు



ఏర్పేడు, మే 27(ఆంధ్రజ్యోతి): మండలం లోని వికృతమాల పంచాయతీలో సర్వే నెం.52 కాలువ పోరంబోకు స్థలంలో రెండిళ్లను రెవెన్యూ అధికారులు కూల్చి వేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు ఇంటి పట్టాలను సృష్టించి ఒక్కో పట్టా రూ.3 లక్షలకు విక్రయించారు. ఆ స్థలంలో ఇప్పటికే 22 ఇళ్లు నిర్మించుకున్నారు. కొద్ది రోజులుగా 8 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. అందులో 2 నిర్మాణాలను గ్రామ రెవెన్యూ అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం తొలగించారు. కేవలం తమ ఇళ్లనే తొలగించడం ఏమిటని చిన్న, రమణయ్యనాయుడు ప్రశ్నిస్తున్నారు. దీనిపై తహసీల్దారు భార్గవిని వివరణ కోరగా... తాను సెలవులో ఉన్నానని చెప్పారు. వికృతమాలలో నిర్మాణాల తొలగింపు విషయం తనకు తెలియదన్నారు. అక్రమ నిర్మాణాలు ఆర్డీవో దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాలతో తొలగించినట్లు రెవెన్యూ అధికారి తనకు తెలిపాడన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు

బుచ్చినాయుడుకండ్రిగ, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు. బీఎన్‌కండ్రిగ సచివాలయంలో రేషన్ కార్డుల దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు జరిగింది. బియ్యంకార్డుల్లో పిల్లలు, కొత్తగా పెళ్లైన వారిని చేర్చవచ్చని తెలిపారు. సభ్యుల తొలగింపు, కొత్త రేషన్‌కార్డులు, కార్డుల విభజన, మార్పులు కూడా చేసుకోవచ్చన్నారు.

పుత్తూరు వార్తలు

ఎమ్మెల్యేకు చౌకదుకాణ డీలర్ల సన్మానం



వడమాలపేట,మే 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఎండియూ వాహన వ్యవస్థ రద్దు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని చౌక దుకాణ డీలర్లు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ను ఘనంగా సన్మానించారు. మంగళవారం తిరుపతిలోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో భానుప్రకాష్ మాట్లాడుతూ... ఇకపై కార్డుదారులకు నిత్యావసర సరకులు ప్రతి నెలా వందశాతం అందేలా డీలర్లు శ్రద్ధ వహించాలని చెప్పారు.ఈ కార్యక్రమం చౌక దుకాణ డీలర్ల మండల అధ్యక్షుడు మురళీమనోహర్, కార్యదర్శి చెంగల్రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



హేమాద్రి సాయి

వడమాలపేట, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్వీఆర్‌పురానికి చెందిన హేమాద్రిసాయి(15) అదృశ్యమైనట్లు ఎస్‌ఐ ధర్మారెడ్డి చెప్పారు. శ్రీకాళహస్తికి చెందిన రమేష్, లక్ష్మి కుమారుడు హేమాద్రిసాయి వారం క్రితం ఎస్వీఆర్‌పురం లోని పిన్నమ్మ విజయలక్ష్మి ఇంటికి వచ్చాడు. రెండు రోజుల నుంచి కనబడడం లేదని బాలుడి పిన్ని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

యోగాతో దీర్ఘకాలిక వ్యాధులకు ఉపశమనం

పుత్తూరు టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): యోగాతో దీర్ఘకాలిన వ్యాధుల నుంచి ఉపశమనం ఉంటుందని తడుకు పంచాయతీ కార్యదర్శి నరేష్ పేర్కొన్నారు. మంగళవారం తడుకు, శిరుగురాజపాలెం పంచాయతీల పరిధిలో యోగాంధ్ర శిబిరాలు జరిగాయి. యోగా చేయడం వలన కలిగే ప్రయోజనాలను మాస్టర్ తరుణ విశదీకరించారు.

వడమాలపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు కేంద్రాల్లో యోగాంధ్ర శిక్షణ శిబిరాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. వడమాలపేట, అప్పలాయగుంట, ఎస్వీఆర్‌పురం, కాయం గ్రామాల్లో యోగా శిక్షకులు ఆసనాలు వేయించారు. ఎంపీడీవో శేషగిరిరావు, కార్యదర్శి రితేష్, టీడీపీ నాయకులు ధనంజయులు నాయుడు, వెంకటేశ్వర రావు, ఢిల్లీ ప్రసాద్, ఉమాపతి పాల్గొన్నారు.

కడప గడపకు తరలివెళ్లిన పసుపుదండు



పుత్తూరు అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కడప గడపలో చరిత్రాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడుకు నగరి నియోజకవర్గం నుంచి పసుపుదండు కదిలివెళ్లింది. నియోజకవర్గ పార్టీ శ్రేణులను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ వారితో కలిసి వెళ్లారు. పలువురు నాయకులు సోమవారం బయలుదేరి వెళ్లగా, మరికొందరు మంగళవారం ఉదయం చేరుకున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ చరిత్ర సృష్టించనుందని నాయకులు అన్నారు.

వన్‌సైడ్ పార్కింగ్‌పై అవగాహన

రేణిగుంట, మే 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన మార్గాల్లో వన్ సైడ్ పార్కింగ్‌పై దుకాణ యజమానులకు సీఐ జయచంద్ర అవగాహన కల్పించారు. ప్రధాన వీధుల్లోని దుకాణ యజమానులకు వన్‌సైడ్ పార్కింగ్‌పై అవగాహన కల్పించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమించి పార్కింగ్ చేస్తే జరిమానా విధిస్తామని తెలిపారు.

మహానాడుకు పసుపు సేన పయనం







మునిరాజానాయుడు, విజయకుమార్ ఆధ్వర్యంలో మహానాడుకు ప్రయాణం - మహానాడు వద్ద మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు తదితరులు

శ్రీకాళహస్తి, మే 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గ పసుపు సేన కడప మహానాడుకు ఉత్సాహంగా బయలుదేరింది. రెండు రోజులు ముందుగానే శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ మహానాడు వేదిక వద్దకు చేరుకుని ఏర్పాట్ల పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో మంగళవారం శ్రీకాళహస్తి పట్టణాధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో తెలుగు మహిళలు, నాయకులు, కార్యకర్తలు రామసేతు వంతెన నుంచి మహానాడుకు వెళ్లారు. కంఠా రమేష్, గాండ్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఇక తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షుడు మునిరాజానాయుడు ఆధ్వర్యంలో పలువురు మహానాడుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో రాచగున్నేరి మాజీ సర్పంచ్ జగన్నాథ నాయుడు, కామేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీనాయుడు, సత్రవాడ మునిరామయ్య ఆధ్వర్యంలో పలువురు మహానాడుకు చేరుకున్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెంచయ్యనాయుడు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మహానాడుకు తరలివెళ్లారు.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడుకు నారాయణవనం మండలం నుంచి భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. జడ్పీటీసీ సుమన్‌కుమార్, నాయకులు మాణిక్యం రెడ్డి, ప్రసన్నకుమార్, మహేష్, రుకేష్, సురేష్ తదితరులు ఉన్నారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడుకు మండలం నుంచి తెలుగు తమ్ముళ్లు తరలి వెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు ఆధ్వర్యంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు సుమారు 8 వాహనాల్లో వెళ్లారు. అదే విధంగా మడిబాక సర్పంచ్ రవినాయుడు ఆధ్వర్యంలో కూడా టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు మహానాడుకు బయలుదేరి వెళ్లారు. రెండు బస్సులు, 50 కార్లలో నాయకులు, కార్యకర్తలు మహానాడుకు వెళ్లినట్టు సమాచారం.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడుకు వరదయ్యపాళెం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. యుగంధర్‌రెడ్డి, నరసరాజు, అడివూడి సుదర్శనరెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులున్నారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడుకు కేవీబీపురం నుంచి టీడీపీ నాయకులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు, తిరుపతి పార్లమెంటు తెలుగు రైతు అధ్యక్షుడు గోపీనాథరెడ్డి, తిరుపతి పార్లమెంటు తెలుగు యువత అధికార ప్రతినిధి ఏ.సురేష్‌రెడ్డి, రామచంద్రయ్య, మునికుమార్ యాదవ్, మునిశంకర్, వెంకటేష్ తదితరులున్నారు.



సభ్యత్వ నమోదు కిట్ స్వీకరిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్







మడిబాక, పిచ్చాటూరు నుంచి మహానాడుకు తరలివెళుతున్న టీడీపీ నాయకులు - మహానాడు వద్ద కేవీబీపురం మండల నాయకులు

కిటకిటలాడిన ముక్కంటి క్షేత్రం



శ్రీకాళహస్తి, మే 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. సుమారు 30వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 594 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,537మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,141మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,952మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,960, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 566మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 420 మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 133మంది భక్తులు పూజలుచేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు 27,904 విక్కయించారు.

శ్మశానంలో బోరు

ఏర్పేడు, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వికృతమాల దళితవాడ శ్మశాన వాటికలో స్థానికుల వినతితో ఎమ్మెల్యే సుధీర్ బోరును ఏర్పాటు చేశారు. సమస్య తీరడంతో గ్రామస్థులు ఎమ్మెల్యే సుధీర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ హేమాక్షి రాయల్, చలపతి, గిరిప్రకాష్, వెంకటాద్రి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి, మే 27(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని మంగళవారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి ఇంద్రేష్, సినీ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. నిర్మాత నిర్మాత దిల్‌రాజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద ఆలయ వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కీరవాణిని హోటల్ ఎంజీఎం గ్రాండ్ వద్ద సంస్థ డైరెక్టర్ మయూర్ సత్కరించారు. మధ్యప్రదేశ్ మంత్రి భూపేంద్రసింగ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. బీజేపీ నాయకులు గోపాల్, వెంకటేష్, చందురాయల్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని కార్మికుడి మృతి

ఏర్పేడు, మే 27(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని కార్మికుడు మృతి చెందాడు. ఏర్పేడు ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాలు... ఉత్తరప్రదేశ్‌కు చెందిన రిషికేష్(33) మేర్లపాక సమీపంలో ఉన్న పుష్పిత్ స్టీల్స్‌లో పనిచేస్తున్నాడు. కర్మాగారం ఆవరణలోని క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం తెల్లవారు జామున పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రిషికేష్ దుర్మరణం చెందాడు. సమాచారం తెలుసుకున్న సహచర కార్మికులు యజమాన్యానికి విషయాన్ని చేరవేశారు. ఈక్రమంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తలరించారు.

బంగారు గొలుసు దోపిడీ

శ్రీకాళహస్తి, మే 27(ఆంధ్రజ్యోతి): నడచి వెళుతున్న మహిళ మెడలోని బంగారు గొలుసును ద్విచక్ర వాహనంపై వచ్చిన దుండగులు దోపిడీ చేశారు. శ్రీకాళహస్తి పట్టణ శివారు బంగారమ్మ కాలనీకి చెందిన సురేఖ(42) తెలుగుగంగ కాలనీ రోడ్డులో వాకింగ్‌కు వెళ్తుంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం వాకింగ్ చేస్తుండగా కాలనీలో మాటువేసిన ముగ్గురు దుండగులు మహిళ మెడలోని 32గ్రాముల బంగారు గొలుసును లాక్కుని ఎన్టీఆర్‌నగర్ కాలనీ వైపు పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నెహ్రూకు ఘన నివాళి

శ్రీకాళహస్తి, మే 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు బాలగురవం బాబు, నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. రత్నం, ఫయాజ్, శ్రీనుగౌడ్, గౌస్‌బాషా, ఖలీల్, బాబు, మురళి తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణను అడ్డుకుంటాం రైతు సంఘం



చెరువు ఆక్రమణలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

రేణిగుంట, మే 27, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రంరెడ్డిపాలెం చెరువు ఆక్రమణను అడ్డుకుంటామని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హేమలత చెప్పారు. మంగళవారం తూకివాకం పంచాయతీలోని ఎర్రంరెడ్డి పాలెం చెరువు ఆక్రమణలను రైతులు, సీపీఎం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తూకివాకం లెక్కదాఖలా సర్వే నెం.141లో 55 ఎకరాల్లో ఎర్రంరెడ్డిపాలెం చెరువు ఉండగా, ముగ్గురు కల్యాణ మండపం పేరుతో 10.55 ఎకరాలను పూడ్చి వేసి ప్రహరి నిర్మించారని తెలిపారు. దీనిపై గ్రామస్తులు, రైతులు గ్రీవెన్స్‌డేలో కలెక్టర్, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. సీపీఎం ప్రాంతీయ కన్వీనర్ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిన ఒత్తిడి దూరం



బీఎన్‌కండ్రిగలో యోగా నేర్పుతున్న సురేష్‌నాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ, మే 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆసనాలపై యోగా గురువు సురేష్‌నాయుడు అవగాహన కల్పించారు. ఏఓ త్రివిక్రమరావు మాట్లాడుతూ... దైనందిన జీవితంలో యోగా భాగం కావాలన్నారు. యోగా సాధనతో మానసిక, శారీరక రుగ్మతల నుంచి విముక్తి లభిస్తుందన్నారు. ఎంఈవో మునిసుబ్రమణ్యం, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాయ్స్ హైస్కూల్, కరకంబాడి, గుత్తివారిపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో, గాజులమండ్యం శివాలయంలో యోగ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీవో శేఖర్ పేర్కొన్నారు. మంగళవారం నారాయణవనంలోని బాలుర జడ్పీ హైస్కూల్‌లో యోగాంధ్ర నిర్వహించారు. పాలమంగళం జడ్పీ హైస్కూల్, అరణ్యంకండ్రిగ సచివాలయ పరిధిలో యోగాంధ్ర శిబిరాలు జరిగాయి.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని యోగా శిక్షకులు మనోహర్, తాహిర్ చెప్పారు. వరదయ్యపాళెం సచివాలయం 1, 2 పరిధిలో పంచాయతీ కార్యదర్శి బసిరెడ్డి పర్యవేక్షణలో యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంతవేలూరు, బత్తలవల్లం, మరదవాడ క్లస్టర్లలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుధీర్‌రెడ్డి, ఎంఈవో సరస్వతి, డీటీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మహానాడులో ఎమ్మెల్యే బిజీ బీజీ



శ్రీకాళహస్తి, మే 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సుధీర్ కడపలో జరుగుతున్న మహానాడులో మంగళవారం బిజీబీజీగా గడిపారు. రెండు రోజుల ముందు నుంచి మహానాడు ఏర్పాట్ల పనుల్లో ఎమ్మెల్యే నిమగ్నమయ్యారు. మంగళవారం తొలిరోజు పలువురు నాయకులు, కార్యకర్తలతో సరదాగా గడిపారు.

మహానాడులో తెలుగు తమ్ముళ్ల సేవాభావం



శ్రీకాళహస్తి, మే 27(ఆంధ్రజ్యోతి): కడపలో జరిగే మహానాడులో తెలుగు తమ్ముళ్లు సేవాభావం కనబరిచారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగాలి చలపతినాయుడు అన్నారు. మహానాడులో ఎన్టీఆర్ ట్రస్టు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో శ్రీకాళహస్తికి చెందిన టీడీపీ నాయకులు మునిరాజాయాదవ్, కొలంగుంట మణి, పేట బాలాజీరెడ్డి రక్తదానం చేశారు. వారికి ట్రస్టు సీఈవో రాజేంద్ర ప్రసాద్ ప్రశంసాపత్రాలు అందజేశారు. మిన్నల రవి, ఉమేష్‌రావు పాల్గొన్నారు.

టీడీపీ మండలాధ్యక్షుడికి ఘన సత్కారం



ఏర్పేడు, మే 27(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షుడిగా నియమితులైన పేరం నాగరాజునాయుడిని సోమవారం ఘన సత్కారం చేశారు. గోవిందవరం మాజీ సర్పంచ్ పేరం చిరంజీవులునాయుడు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు నాగరాజునాయుడికి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. భూపతినాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, మునికృష్ణయాదవ్, చలపతి నాయుడు, మహేష్‌నాయుడు, సురేంద్ర, భాస్కర్‌నాయుడు తదితరలున్నారు.

భక్తిశ్రద్ధలతో అంకాలమ్మ జాతర

నారాయణవనం, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలమంగలం ఉత్తరంలో కొలువై ఉన్న రౌద్రాలి అంకాలమ్మ జాతరలో భాగంగా మంగళవారం ఉదయం గెరిగను ఊరేగించారు. అభిషేకాలు, నిత్య పూజలు జరిగాయి. భక్తులు శరీరానికి ఇనుప చువ్వలు గుచ్చుకుని డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా వచ్చి మొక్కు చెల్లించారు.